RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 29 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ బుధవారం 06-05-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## ఏడు ఇరానీ ఫాస్ట్ బోట్లను

# పేల్చేశాం

2వ పేజీలో...

### అమెరికా దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన ఏడు ఫాస్ట్ బోట్లను పేల్చివేసినట్లు అమెరికా దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో.. అక్కడ చిక్కుకున్న నౌకలను తరలించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. యూఏఈ, దక్షిణ కొరియా దేశాలకు చెందిన నౌకలపై దాడి జరిగినట్లు తెలుస్తోంది.



## బెంగాల్, అసోంలలో

# ఓట్ చోరీ

### జనాదేశాన్ను చోరీచేసిన బిజెపి మరోమారు రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ, : బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరిగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.





## రవీంద్రుని జయంతి రోజు

# ప్రమాణస్వీకారం

2వ పేజీలో...

### కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై బిజెపి స్పష్టత సిఎం అభ్యర్థిని ఎంపికచేయనున్న అధిష్టానం

కోల్‌కతా, మే5 : పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులు చేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్‌కు అందజేయనున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ..



2వ పేజీలో...

## అన్నిరకాల దౌర్జన్యాలు

# చేశారు

### తనపై కూడా దాడికి తెగబడ్డారు ఫేస్‌బుక్ పేజీలో మమత ఫోన్‌కాల్ ఆడియో



2వ పేజీలో...

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా

# కల్పించాలి

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రాజన్న సిరిసిల్లా జిల్లా: డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట గ్రామంలోని పంతులు తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ తో కలిసి భూమి పూజ చేశారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గం లోని 11 ప్రాంతాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవీ సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులనుద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు.



2వ పేజీలో...

## బిసిలను పట్టించుకోని

# కేంద్రం

### 9న ఆమరణ దీక్ష చేపడతానన్న విహెచ్

హైదరాబాద్, : బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడిన ఆయన, ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. 'బీసీ హక్కుల కోసం ప్రాణం పోయినా సరే పోరాడుతా' అని స్పష్టం చేసిన వీహెచ్..

## బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు

# రాజకీయాలు

### వరంగల్ రైతుమేళా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి



2వ పేజీలో...



## కేసీఆర్ సర్జికల్

# స్ట్రైక్..

2వ పేజీలో...

హైదరాబాద్,: కొత్తగా చెప్పాల్సిన పనిలేదు.. కెసిఆర్ ఫామ్ హౌస్ లో ఉన్నా.. ప్రగతిభవన్ లో ఉన్నా.. ఆయన దృష్టి మొత్తం రాజకీయాలు చుట్టూ తిరుగుతుంది. ఆయన ఆలోచన మొత్తం అధికారాన్ని సాధించడం లేదా సుస్థిరం చేసుకోవడం అయిపోగానే సాగుతుంది. కెసిఆర్ గురించి తెలిసినవారు.. కెసిఆర్ గురించి ఎరుకైన వారు నిత్యం చెప్పే మాటలు ఇవే. కెసిఆర్ రాజకీయ దురంధరుడు. తెలంగాణ రాజకీయాలలో తలపండినవాడు. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడినవాడు.. అన్నిటికంటే ముఖ్యంగా హేళన చేసిన వారి ముందు తల ఎగరేసి సవాల్ చేసినవాడు.. కొన్ని సందర్భాలలో ఆయన అంచనాలు తప్పవచ్చు. కానీ మెజారిటీ సందర్భాలలో ఆయన అంచనాలు ఏమాత్రం తప్పలేదు.కెసిఆర్ ఇప్పుడు ఒక రకమైన సంధి దశను ఎదుర్కొంటున్నారు. బహుశా ఆయన రాజకీయ జీవితంలో ఏనాడు కూడా ఇలాంటి స్థితిని ఎదుర్కొని ఉండకపోవచ్చు. అంతటి తెలంగాణ ఉద్యమంలో కూడా కేసీఆర్ ఒత్తిడి ఎదుర్కొన్నప్పటికీ.. బలంగా నిలబడ్డారు. స్థిరంగా అడుగులు వేశారు. ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా కార్యచరణ రూపొందించారు. అందువల్లే ఆయనను ఇప్పటికీ తెలంగాణ ప్రజలు నమ్ముతుంటారు. ఆయన మాటలను వింటారు కేసీఆర్ కుటుంబంలో పరిస్థితి ఏమాత్రం బాగోలేదు. ముఖ్యంగా కన్న కూతురు కేసీఆర్ వ్యవహార శైలిని ప్రశ్నిస్తున్నారు. కెసిఆర్ నాయకత్వాన్ని ఎదిరించారు. కెసిఆర్ పరిపాలన కాలంలో జరిగిన లోపాలను ఎత్తిచూపుతున్నారు. సహజంగానే ప్రశ్నించే స్వభావాన్ని కెసిఆర్ తట్టుకోలేరు. అందువల్లే తనకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎవరిని కూడా పార్టీలో ఉంచుకోలేదు. చివరికి కన్న కూతురిని సైతం బయటికి పంపించారు కేసీఆర్.



2వ పేజీలో...

## ఎట్టకేలకు స్పందించిన

# హైడ్రా..

### కొత్వాల్‌గూడలో రాఘవ స్టోన్ క్రషర్స్ కూల్చివేత!

హైదరాబాద్: ప్రజా వ్యతిరేకతతో ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని కొత్వాల్ గూడలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్లను హైడ్రా కూల్చివేసింది. రాఘవ క్రషర్స్‌తో పాటు పలు కంపెనీలకు చెందిన ఐదు క్రషర్ మెషిన్లతో పాటు 12 ఆర్ఎంసీ యూనిట్లను తొలగించింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్ శాఖల సాయంతో హైడ్రా వీటిని కూల్చివేసింది.

జీవో 111 ఉల్లంఘిస్తూ క్రషర్స్ ఏర్పాటు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఏకంగా జీవో 111ను ఉల్లంఘిస్తూ క్రషర్స్ నడుపుతున్నా.. రెండేండ్లుగా నిరాటంకంగా అక్రమ మైనింగ్ కొనసాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదని కొంతకాలంగా స్థానికులు విమర్శిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి సైతం 'అనుమతిలేని ఆ క్రషర్‌ను మూసివేయండి' అని క్లోజర్ ఉత్తర్వులు ఇచ్చి, ఆ కాగితాలను కోల్డ్ స్టోరేజీలో పడేసిందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కొత్వాల్‌గూడలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ క్రషర్స్ అక్రమ మైనింగ్ చేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఇప్పటికే పలుమార్లు ఆరోపించారు. అసెంబ్లీలో సైతం రాఘవ క్రషర్స్ అక్రమ మైనింగ్‌పై ప్రశ్నించారు. బీఆర్ఎస్ పోరాటంతో పాటు ప్రజల్లో వ్యతిరేకత రావడంతో చివరకు పొంగులేటిని ఒప్పించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూల్చివేతలు మొదలుపెట్టింది.

# కేసీఆర్ సర్జికల్ స్ట్రైక్..



ఇటీవల కాలంలో కేసీఆర్ ను రేవంత్ కూడా విమర్శించని స్థాయిలో కవిత విమర్శిస్తోంది. ఏకంగా కేసీఆర్ ను ఉద్దేశించి మరమనిషి అని వ్యాఖ్యానించింది. మన మనిషి కాదని ఓపెన్ గానే చెప్పేసింది. కెసిఆర్ చుట్టూ పందికొక్కులు ఉన్నాయని.. తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. నిజంగా కేసీఆర్ గురించి ఈ స్థాయిలో మాట్లాడటం.. అది కూడా కవిత మాట్లాడటం గులాబీ పార్టీ శ్రేణులకు ఏమాత్రం రుచించడం లేదు. అటు కవిత చేస్తున్న విమర్శలు.. పార్టీకి ఎదురవుతున్న వరుస ఓటములు.. ఇవన్నీ కూడా కేసీఆర్ ను ఆలోచింపజేశాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందువల్లే ఆయన మునుపటి స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అడుగులు వేస్తున్నారు. అందువల్లే ఇటీవల జరిగిన సమావేశంలో పార్టీకి సంబంధించిన రాష్ట్రస్థాయి కమిటీ మినహా.. మిగతా అన్నింటిని రద్దు చేశారు. పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను కేటీఆర్ కు అప్పగించారు. అదే కాదు గోడమీద పిల్లి లాగా వ్యవహరిస్తున్న నాయకులను బయటకు వెళ్లిపోవాలని హెచ్చరించారు. పార్టీలో ఉంటూ.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారందరిని వెళ్లిపోవాలని మొహమాటం లేకుండా చెప్పేశారు. అంతేకాదు సోషల్

**మొదటిపేజీ తరువాయి...**

మీడియాలో మాత్రమే యాక్టివ్గా ఉంటూ.. ప్రజా క్షేత్రంలో అంతగా కనిపించని నాయకులకు ఈసారి టికెట్లు ఇచ్చేది లేదని కెసిఆర్ స్పష్టం చేశారు. "ముఖం చూసి టికెట్లు ఇచ్చేది ఉండదు. ప్రజాక్షేత్రంలో ఎవరైతే మెరుగ్గా పనిచేస్తారో వారికి మాత్రమే టికెట్లు ఇస్తాం. సిఫారసులతో వచ్చినప్పటికీ కూడా అవకాశం ఉండదు. సోషల్ మీడియాలో హంగామా చేసే వారికి పార్టీ టికెట్లు ఇచ్చేది ఉండదని" కెసిఆర్ స్పష్టం చేశారు. ఇటీవల మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఆ వ్యవహారం కాస్త మీడియాలో విపరీతమైన చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఆ తరహా నాయకులు పార్టీలో ఉండడం కంటే వెళ్లిపోవడం మంచిదని కెసిఆర్ నేరుగానే చెప్పేశారు.. ఈ ప్రకారం ఆ తరహా నేతలకు తన పార్టీలో చోటు లేదని.. ఒకవేళ ఉన్నా.. అటువంటి వారికి టికెట్లు ఇచ్చేది లేదని కెసిఆర్ స్పష్టం చేశారు.. అయితే సోషల్ మీడియాలో హంగామా చేస్తున్న నేతల మీద కేసీఆర్ గట్టిగానే ఫోకస్ పెట్టినట్టు తెలుస్తుంది.. ఎందుకంటే సోషల్ మీడియాలో హంగామా చేశారు నాయకులు ప్రజలకు దూరంగా ఉంటున్నారు. అటువంటి వారికి టికెట్లు ఇచ్చి ఓడిపోవడం కంటే.. ఇవ్వకపోవడమే ఉత్తమం అన్నట్టుగా కెసిఆర్ వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. కేటీఆర్ కు దగ్గరగా ఉండే నాయకులు సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారాన్ని కోరుకుంటారు. సోషల్ మీడియాలో అడ్డగోలుగా కామెంట్లు చేస్తూ ప్రచారంలో ఉంటారు. అయితే వారందరికీ చెక్ పెట్టే విధంగా కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. ఒక రకంగా కెసిఆర్ మాట్లాడిన మాటలు గులాబీ పార్టీలో సర్జికల్ స్ట్రైక్ లాగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కెసిఆర్ తీసుకున్న ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే.. పార్టీ మునుపటి వైభవాన్ని సాధించడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అన్నిరకాల దౌర్జన్యాలు చేశారు



కోల్‌కతా, : కౌంటింగ్ సెంటర్‌లో తనపై దాడి జరిగినట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీతో ఫోన్‌కాల్‌లో ఆమె ఈ ఆరోపణలు చేశారు. మమతా బెనర్జీ మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను ఎంపీ కళ్యాణ్ బెనర్జీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేశారు. కౌంటింగ్ వద్ద ప్రవర్తన సరిగా లేదని, తుది రౌండ్ల సమయంలో అక్రమాలు జరిగినట్లు మమతా బెనర్జీ తన ఫోన్ కాల్‌లో పేర్కొన్నారు. భబానీపూర్‌లో తుది రౌండ్ల కౌంటింగ్ మా ప్రాంతానివని, ఆ సమయంలో కొందరు గుండాలు కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించారని, నన్ను కొట్టారని, సీఆర్పీఎఫ్ సహాయంతో మా ఏజెంట్లను తోసేశారని మమతా బెనర్జీ ఆ ఫోన్‌కాల్‌లో ఆరోపించారు. కీలక సమయంలో కౌంటింగ్ హాల్‌లోకి తనను ఎంట్రీ కానివ్వ లేదన్నారు. భబానీపూర్‌లో కౌంటింగ్ పక్రియ థ్రిల్లింగ్‌గా సాగింది. 20 రౌండ్ల కౌంటింగ్‌లో కొన్ని సమయాల్లో అటూ ఇటూ వెళ్లింది. ఆరంభంలో మమతా బెనర్జీ రెండు వేల ఓట్ల మెజారిటీతో ఉన్నారు. ఏడో రౌండ్ సమయానికి ఆమె 17 వేల ఓట్లు ఆధిక్యంలోకి వెళ్లారు. ఇక ఆ సమయంలో టీఎంసీ మద్దతుదారులు దాదాపు సంబరాలు చేసుకున్నారు. ఇక తర్వాత ఫలితాల్లో మార్పు మొదలైంది.

**మొదటిపేజీ తరువాయి...**

14వ రౌండ్ ముగిసే వరకు మమతా బెనర్జీ ఆధిక్యం నాలుగు వేలకు పడిపోయింది. కొన్ని రౌండ్ల తేడాలోనే నాటకీయంగా బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఆధిక్యంలోకి వెళ్లారు. ఆ తర్వాత ఆయన 15,105 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. దీంతో దీదీకి షాక్ ఇచ్చాడు సువేంధు. 16వ రౌండ్ వరకు తానే లీడింగ్‌లో ఉన్నట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. కానీ తమ పార్టీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్లను తొలగించిన తర్వాత మార్పు మొదలైనట్లు ఆమె ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను సరైన సీలింగ్ లేకుండానే స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారని, తుది రౌండ్ల కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ హాల్‌లో టీఎంసీ ప్రతినిధులు లేరని ఆమె పేర్కొన్నారు. చిత్రహింసకు గురిచేసినట్లు మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం, బీజేపీ ఆదేశాల ప్రకారమే ఎన్నికల సంఘం, సీఆర్పీఎఫ్, స్థానిక ఎన్నికల అధికారులు వ్యవహరించినట్లు మమతా బెనర్జీ విమర్శించారు. ఓటర్ రోల్స్‌లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. బలవంతంగా ఓట్లను చోరీ చేశారన్నారు. అన్ని ఆధారాలను డాక్యుమెంట్ చేశామని, వాటిని కోర్టులో సమర్పించనున్నట్లు తెలిపారు. ఇది బీజేపీ విజయం కాదు, అనైతిక గేమ్ అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా ఎన్నికల్లో ఆ పార్టీకి కేవలం 81 సీట్లు మాత్రమే వచ్చాయని తేలింది. బీజేపీ 206 స్థానాల్లో విజయ కేతనం ఎగురవేసింది. అయితే భవానీపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సీఎం మమతా బెనర్జీ అనూహ్య రీతిలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా తీర్పును చోరీ చేశారని ఆమె అన్నారు. అనైతిక రీతిలో తనను ఓడించినట్లు ఆమె చెప్పారు. అయితే

# ఎట్టకేలకు స్పందించిన హైడ్రా..

**మొదటిపేజీ తరువాయి...**

అసైన్డ్ భూమిలో అక్రమ మైనింగ్: 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిరక్షణ కోసం జీవో 111ను తెచ్చిన సంగతి తెలిసిందే. జంట జలాశయాల చుట్టూ ఉన్న 84 గ్రామాల పరిధిలోని క్యాచ్‌మెంట్ ఏరియాలో ఎలాంటి కాలుష్య కారకాలు ఉత్పత్తి చేసే సంస్థలను ఏర్పాటు చేయొద్దని, విషపూరిత రసాయనాలు అమ్మే వ్యాపారాలకు అనుమతులు ఇవ్వరాదని స్పష్టమైన నిబంధనలు పొందుపరిచింది. అయినా వీటిని అతిక్రమిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా క్రషర్ నిర్వహిస్తున్నదని, సహజ వనరులను కొల్లగొడుతున్నదని, రూ.వందల కోట్లు దోచుకుంటున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిరోజుల కిందట మంత్రి పొంగులేటి కుమారుడు గండిపేట రెవెన్యూ మండల పరిధి వట్టినాగులపల్లిలో విలువైన భూమిని ఆక్రమించుకునేందుకు దాదాపు వందమంది బౌన్సర్లతో అర్ధరాత్రి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు చర్యలు తీసుకోగా, తన కుమారుడిపై కేసు నమోదు చేసిన అధికారులను మంత్రి బదిలీచేయించారన్న వార్త అప్పట్లో పెనుసంచలనం రేపింది. తాజాగా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలోని సర్వేనంబర్లు 62, 63లోని ఐదెకరాల అసైన్డ్ భూముల్లో రెండేండ్లుగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భారీ క్రషర్లు నడుపుతున్నదని స్థానికులు చెప్తున్నారు. గుట్టలను పిండి చేస్తున్నా, చర్యలు తీసుకోవాల్సిన పొల్యూషన్ బోర్డు, మైనింగ్, రెవెన్యూ, విద్యుత్, తదితర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో భారీ క్రషర్ మెషీన్లను దింపి నగర నలుమూలల్లో ఆ సంస్థ చేపట్టిన ప్రాజెక్టులకు ఇక్కడి నుంచే రాతి ఇసుకను సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో రెండేండ్లలో రూ.వందల కోట్ల లావాదేవీలు జరిగాయని, అటు ప్రకృతికి, ఇటు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

**మొదటిపేజీ తరువాయి...**

తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం మొత్తం తీసుకోవాలని కోరారు. రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని.. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా చేయండి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి.(తెలంగాణ వాణి) :జిల్లాలో ధాన్యం కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం పీక్ దశలో కొనసాగుతున్నందున ఎటువంటి అంతరాయాలు లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోమంగళవారం పౌర సరఫరాలు శాఖ, సంస్థ, వ్యవసాయ, సహకార, డిఆర్డీఓ, పంచాయతీ రాజ్, వైద్య శాఖల అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు, సౌకర్యాలు పట్ల థర్డ్ పార్టీ పరిశీలనకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయొద్దని సూచించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 185 కేంద్రాలు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 130 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాని, మిగిలినవి సత్వరం ప్రారంభించాలని తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఐదు పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 108 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. ఈ సీజన్‌లో మొత్తం 1 లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.గత సంవత్సరం లక్షా 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ఈ సంవత్సరం వరి పంట అధికంగా పండినందున మరింత ఎక్కువ ధాన్యం కొనుగోలు అయ్యే అవకాశముందని తెలిపారు. హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, తాగునీటి, నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. అస్వస్థతకు గురైతే తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న 4 రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గన్ని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. కోతలు ప్రారంభమైన నేపథ్యంలో పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కొనుగోలు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వారీగా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని అన్నారు.వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతు వేదికల వద్ద రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సరైన విధానంలో ధాన్యం విక్రయానికి మార్గదర్శకాలు అందించాలని సూచించారు. ప్రస్తుతం పీక్ మూవ్‌మెంట్ కొనసాగుతున్నందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు తప్పనిసరిగా అంగీకార పత్రాలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఓ శ్రీలత, వైద్య శాఖ అధికారి డా మధుసూదన్, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను పట్టించుకోని కేంద్రం

**మొదటిపేజీ తరువాయి...**

బీజేపీ బీసీ ఎంపీలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 'అంబేద్కర్‌ను మా దేవుడిగా భావిస్తాం. అలాంటి మహనీయుడిని కూడా అవమానించే విధంగా పరిస్థితులు ఉన్నాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జరుగుతున్న జనగణనలో బీసీల ప్రస్తావనే లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'బీసీలు ఓట్లు వేయడం లేదా? వారి సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని వీహెచ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు లేఖలు రాసినా స్పందన రాలేదని వీహెచ్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ధర్నాలు జరిగినప్పటికీ బీసీ సమస్యలపై కేంద్రం వైఖరిలో మార్పు రాలేదని వీహెచ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే తాను నిరాహార దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించారు. వీహెచ్ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో బీసీ అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

# బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు



**మొదటిపేజీ తరువాయి...**

హనుమకొండ, మే5 : బిఆర్ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని



విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరివేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'రైతులకు ఎకరానికి రూ.12వేల ఆర్థిక సాయంతోపాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌కు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నాం. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోము' అని పొంగులేటి అన్నారు.

# రవీంద్రుని జయంతి రోజు ప్రమాణస్వీకారం

**మొదటిపేజీ తరువాయి...**

గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం ఆయన రాజీనామా సమర్పించాల్సిందిగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానిస్తారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసేవరకు మమత తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఇదిలావుంటే బెంగాల్‌లోని అసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసిఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పరిపాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలాకాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మీ పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు. చెప్పినట్లుగానే సోమవారం గెలిచిన వెంటనే ఆయన ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు.

# ఏడు ఇరానీ ఫాస్ట్ బోట్లను పేల్చేశాం

**మొదటిపేజీ తరువాయి...**

ఇరాన్ దాడి వల్ల ఫుజైరా ఆయిల్ పోర్టు వద్ద భారీగా మంటలు వ్యాపించినట్లు యూఏఈ పేర్కొన్నది.ప్రాజెక్టు ఫ్రీడమ్ కింద కొన్ని నౌకలను హోర్ముజ్ నుంచి అమెరికా సురక్షితంగా తరలిస్తున్నది. దానిలో భాగంగా మెయర్స్ కంపెనీకి చెందిన భారీ నౌక కూడా హోర్ముజ్‌ను సురక్షితంగా దాటింది. అయితే హోర్ముజ్ జలసంధిలో ఉన్న పరిస్థితి పరిష్కారానికి దారి లేదని, రాజకీయ సంక్షోభాన్ని.. సైనిక చర్యతో క్లియర్ చేయలేరని ఇరానీ మంత్రి అబ్బాస్ అరగాచీ అన్నారు. ఏప్రిల్ 8వ తేదీన అమెరికా, ఇరాన్ మధ్య సీజ్‌ఫైర్ కుదిరిన విషయం తెలిసిందే. అయితే సోమవారం యూఏఈపై డ్రోన్, మిస్సైల్ దాడి జరగడం వల్ల ఆ సీజ్‌ఫైర్ అమలులో ఉందా లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అమెరికా అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఈ విషయంలో వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. ఐఆర్జీసీ క్రూయిజ్ మిస్సైళ్లను రిలీజ్ చేసిందని, తాము రక్షణ కల్పిస్తున్న నౌకలపై డ్రోన్లు, చిన్న బోట్లతో దాడి చేసిందని, కానీ ఐఆర్జీసీ చేసిన ప్రయత్నాన్ని తాము అడ్డుకున్నామని కూపర్ తెలిపారు.

# సంపాదకీయం

## పెట్రోలియం ఉత్పత్తులపై రేషనింగ్

నెల క్రితం అంతర్జాతీయంగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత ఇంధన భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో భారత్ వద్ద సుమారు 66 రోజుల వినియోగానికి సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గత నెల రోజులుగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, ప్రధాన సముద్ర మార్గాల్లో రవాణాకు ఆటంకాలు కలగడం వల్ల దిగుమతుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతోంది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 4.5 నుంచి 5 మిలియన్ బారెళ్ల ముడి చమురును మనం దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ, ప్రస్తుత సరఫరా ఆటంకాల వల్ల ఈ దిగుమతుల్లో 10 నుంచి 15 శాతం వరకు లోటు కనిపిస్తోంది. రష్యా నుంచి వచ్చే చమురు రవాణా మార్గాల్లో బీమా ,షిప్పింగ్ సమస్యలు తలెత్తడం, గల్ఫ్ దేశాల నుంచి వచ్చే సరఫరాలో జాప్యం జరగడం వల్ల రిఫైనరీలకు అందే ముడి చమురు పరిమాణం తగ్గింది. ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం గయానా , బ్రెజిల్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, రవాణా ఖర్చులు పెరగడం సవాలుగా మారింది. దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందని ఈ కారణంగానే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రస్తుతం ఎటువంటి తక్షణ కొరత లేదని, ప్రజలు భయాందోళనతో కొనుగోళ్లు చేయవద్దని విజ్ఞప్తి చేస్తోంది. అయితే, రిటైల్ మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలో కొన్ని చమురు కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. చమురు ధరలు బారెల్ కు 100 డాలర్ల మార్కును దాటి స్థిరంగా కొనసాగితే, భారత్ వంటి దిగుమతి దేశాలపై ద్రవ్యోల్బణ భారం విపరీతంగా పెరుగుతుంది. పశ్చిమాసియాలో పరిస్థితులు మారకపోతే ఇంధన రేషనింగ్ వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి రావచ్చు. రాబోయే రెండు వారాల్లో దిగుమతులు మళ్ళీ గాడిలో పడతాయని, కేంద్రం రష్యా , ఇతర దేశాలతో జరుపుతున్న చర్చలు సఫలమైతే పెట్రోల్, డీజిల్ కొరత సమస్య తలెత్తదని కేంద్రం నమ్మకంతో ఉంది. కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినట్లుగా వస్తున్న ఊహాగానాల్ని కొట్టిపారేసింది. మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ విభాగం నుంచి ధరల పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటనా రాలేదని.. నకిలీ ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఫేక్ సోషల్ మీడియా పోస్టుల్ని కోట్ చేస్తూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఈ ఆర్డర్ నకిలీది. భారత ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వుల్ని అసలు జారీ చేయలేదు.' అని అందులో పేర్కొంది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లీడర్లు ఈ నకిలీ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. దేశంలో పెట్రోల్ ధర రూ. 10, డీజిల్ ధర రూ. 12.50 పెరిగినట్లు.. భారత పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుంచి సర్క్యులర్ వచ్చినట్లుగా ఉన్న ప్రెస్ నోట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. దీనినే నకిలీది అని కేంద్రం స్పష్టం చేసింది. ఇలాంటి నకిలీ వార్తల్ని, ప్రకటనల్ని నమ్మొద్దని.. ఇలాంటి వార్తల్ని ధ్రువీకరించుకునేందుకు ఎల్లప్పుడూ అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఛానెళ్లను చూడాలని స్పష్టం చేసింది. దేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 94.77 గా ఉండగా.. డీజిల్ రూ. 87.67 పలుకుతోంది. ముంబైలో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ. 103.54, రూ. 90.03 వద్ద ఉన్నాయి. ఇక హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద ఉండగా.. డీజిల్ ధర రూ. 95.70 వద్ద ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే.. హైదరాబాద్‌లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలో ఇటీవల 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 29నే బెంగాల్‌లో చివరి దశ పోలింగ్‌తో.. ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో.. కొద్ది రోజుల ముందు నుంచే దేశంలో.. ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరల్ని కేంద్రం పెంచుతుందని వార్తలు వచ్చాయి. అయితే అలాంటిదేం ఉండదని.. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, కేంద్రం కూడా బదులిస్తూ వచ్చాయి. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు రవాణాకు కీలకంగా ఉన్న హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. మరోవైపు ఇరాన్ ఓడరేవుల్ని అమెరికా దిగ్బంధించింది. అక్కడ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. భారత్‌లోనూ నిల్వలు తక్కువగా ఉన్నాయి. క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఒకవైపు.. కొన్ని పెట్రోల్ బంకులు రద్దీగా కనిపిస్తుంటే.. కొన్ని నో స్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. దీంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే సమయంలో ధరల్ని పెంచుతుందని ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం క్రూడాయిల్ ధర ఏప్రిల్ 30న.. 125 డాలర్ల మార్కును చేరి.. నాలుగేళ్ల గరిష్ఠానికి చేరింది. అటు సరఫరాను పునరుద్ధరించడం, ఇటు ధరలను అదుపులో ఉంచడం ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారింది. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా, అంతర్జాతీయ పరిణామాలను బట్టి రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు మంత్రం పాటించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# జిల్లాలో ప్రతి ఒక్కరు జనగణన స్వీయ నమోదు చేసుకోవాలి



జయశంకర్ భూపాలపల్లి (తెలంగాణ వాణి) డిజిటల్ విధానంలో ప్రతిఒక్కరు జనగణన స్వీయ నమోదు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోమంగళవారం జనగణన స్వీయ నమోదుపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనగణన స్వీయ నమోదు చాలా తక్కువగా ఉందని ప్రతి శాఖ అధికారులు, వారి సిబ్బంది, కుటుంబ సభ్యులు స్వీయ గణన చేయాలని ఆదేశించారు. జిల్లాలో గత నెల 26వ తేదీ నుండి జనగణన స్వీయ నమోదు ప్రారంభం అయిందని, మే 10వ తేది వరకు జరుగుతుందని తెలిపారు. పాత్రికేయులు, ప్రజలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలల్లో పని చేస్తున్న సిబ్బంది అలాగే సింగరేణి, జెన్కో తదితర పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తప్పని సరిగా నమోదు కావాలని తెలిపారు. ప్రతి శాఖ నుండి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్వీయ గణన నమోదుకు https:// se.census.gov.in లో వివరాలు నమోదు చేసి వచ్చిన ఐడి నంబర్ ను జాగ్రత్తగా భద్రపరచాలని, మే 10వ తేదితో ఆన్లైన్ ద్వారా నమోదు ముగిసిన తదుపరి మే 11 తరువాత ఇంటింటికి వచ్చే గణన అధికారికి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడి చూపి అప్రూవ్ చేసుకోవాలని అన్నారు. ఆన్లైన్ లో నమోదు చేయడం వల్ల జనగణన సులభం అవుతుందని ప్రజలు తప్పని సరిగా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. అధికారులు వారి వారి శాఖ పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరికి అవగహన కల్పించి నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ జవహర్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గీతం సైన్స్ కోర్సుల అడ్మిషన్ల కోసం మే 17 న ప్రవేశ పరీక్ష

పటాన్ చెరు. మే 5, (తెలంగాణ వాణి రిపోర్టర్): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ సైన్స్ యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం మే 17న గీతం అడ్మిషన్ టెస్ట్ (గాట్-2026, మూడో దశ)ను నిర్వహించనుంది. ఆసక్తి గల అభ్యర్థులు మే 14వ తేదీలోగా విశ్వ విద్యాలయ అధికారక పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను ఆన్ లైన్లో సమర్పించవచ్చని స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రెజా మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. యూజీసీ గుర్తింపుతో పాటు నాక్ ఏంం గ్రేడ్ తో అక్రిడిటేషన్ పొందిన స్కూల్ ఆఫ్ సైన్స్ అంతర్ విభాగ విద్య, అధునాతన పరిశోధనలకు ఒక అగ్రగామి కేంద్రంగా ఆవిర్భవించిందన్నారు. ప్రపంచవ్యాప్త అనుభవం కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకుల మద్దతుతో, ఆవిష్కరణ, డీప్-టెక్ పరిశోధన, వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఒక చైతన్యవంతమైన విద్య వాతావరణాన్ని స్కూల్ ఆఫ్ సైన్స్ అందిస్తోందని తెలిపారు. ఈ స్కూల్ యూజీ స్థాయిలో నాలుగు సంవత్సరాల నిడివి గల బీఎస్సీ కోర్సులను అందిస్తోందన్నారు. బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ లో (ఆనర్స్) కోర్సులతో పాటు, మేనేజ్ మెంట్, సోషల్ సైన్సెస్, డేటా సైన్స్, క్వాంటం కంప్యూటింగ్ లో ఫ్లెక్సిబుల్ మైనర్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు రెండు ప్రధాన వృత్తిపరమైన కోర్సులను కూడా అందజేస్తున్నామన్నారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, కాగ్నిటివ్ సిస్టమ్స్ (మూడేళ్ల కోర్సు) కంప్యూటింగ్, కాగ్నిటివ్ సైన్సెస్ ను మిళితం చేసే బహుళ విషయక కోర్సని, ఇది కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో పరిశ్రమ డిమాండ్ కు అనుగుణంగా రూపొందించినట్టు తెలిపారు. ఐదేళ్ల నిడివి గల బి-ఆప్టోమెట్రీ కోర్సును ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ సహకారంతో అందిస్తున్నామని, బలమైన క్లినికల్ శిక్షణ, ఉపాధి అవకాశాలతో నైపుణ్యం కలిగిన నేత్ర సంరక్షణ నిపుణులను తయారు చేస్తున్నామన్నారు. ఇక, పీజీ స్థాయిలో, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ (అనలిటికల్, ఆర్గానిక్, ఫార్మాస్యూటికల్ స్పెషలైజేషన్లు), డేటా సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్ (మెటీరియల్ సైన్స్)లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులను అందిస్తున్నట్టు తెలిపారు. ఫెలోషిప్ మద్దతుతో కూడిన ఫుల్-టైమ్ పీహెచ్.డీ. కోర్సులు కూడా పలు విభాగాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. భవిష్యత్తు-కేంద్రీకృత పాఠ్యప్రణాళికను డాక్టర్ రెజా వివరిస్తూ, ప్రపంచ పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి డేటా సైన్స్, క్వాంటం సైన్స్ వంటి అధునాతన రంగాలను ఆయా కోర్సులలో పొందుపరిచామని తెలిపారు. విద్యార్థులు ప్రారంభ దశలోనే పరిశోధన అనుభవాన్ని, రెండో ఏడాది నుంచే ఇంటర్న్ షిప్, ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులతో ముఖాముఖితో ప్రయోజనం పొందుతారన్నారు. ఐఐటీ, సీఎస్ఐఆర్, బాబా అణు పరిశోధనా సంస్థ, డీఆర్డీవో వంటి ప్రముఖ సంస్థలతో పాటు డాక్టర్ రెడ్డీస్, టీసీఎస్ వంటి పారిశ్రామిక దిగ్గజాలతో బలమైన సహకారాలను కొనసాగిస్తూ, పటిష్టమైన పరిశోధనా అవకాశాలను, ప్రాంగణ నియామకాలను అందిస్తున్నట్టు ఆయన వివరించారు. అలాగే ప్రతిభావంతులైన విద్యార్థులు ఉపకార వేతనాల (స్కాలర్ షిప్పులు) ను అందిస్తున్నామన్నారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటయ్యే స్కోరుతో నేరుగా మే 17న వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం ష్ష్ష.స్త్రణ్ముఎ.వసబను సందర్శించాలని లేదా హెల్ప్ లైన్ 888 498 4000ను సంప్రదించాలని డాక్టర్ రెజా సూచించారు.

# రైతులకు పంటలపై అవగాహన సదస్సు కార్యక్రమం

## మండల వ్యవసాధికారి రేహానా



డిండి మే 5( తెలంగాణ వాణి ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్ర నగర్, హైదరాబాద్ రైతుల అవగాహన కొరకు రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని డిండి మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆర్.సుశీల , ప్రధాన శాస్త్రవేత్త, మొక్కజొన్న పరిశోధనా స్థానం, రాజేంద్ర నగర్ మరియు డా. బి.లక్ష్మీ ప్రసన్న, శాస్త్రవేత్త, వరి పరిశోధనా విభాగం, రాజేంద్ర నగర్, ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం మరియు అవగాహన అంశాల గురించి వివరించారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించుకోవడం గురించి, నేలతల్లి ఆరోగ్యం కాపాడడం గురించి, అవసరం మేరకే రసాయనాలు వినియోగించడం పై మరియు పంట మార్పిడి పాటించి, సుస్థిర ఆదాయాన్ని పొందడం పై అవగాహన కల్పించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న రకాల వివరాలను తెలియచేయడంతో పాటు, సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించడం పై మరియు సేంద్రీయ పద్ధతులను పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆస్వాదించడం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెహానా వ్యవసాయాధికారి, వెంకటేష్, విస్తరణాధికారి మాట్లాడుతూ రైతులందరూ శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక ఆదాయం పొందాలని పిలుపునిచ్చారు. సిఫారసు మేరకే యూరియాను వాడుకొని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగంతుల రవి సర్పంచ్ మాట్లాడుతూ అవసరం మేరకే యూరియా వాడాలని సూచించారు. పి.కృష్ణయ్య, తౌక్లాపూర్ సర్పంచ్ మాట్లాడుతూ సమగ్ర ఎరువుల యాజమాన్య పాటించాలని సూచించారు. కొండల్ , కందుకూరి సర్పంచ్ మాట్లాడుతూ సమగ్ర ఎరువుల యాజమాన్యం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో విస్తరణాధికారులు సాయి తేజ, అపర్ణ, వనజ మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని వారి సందేహాలను నివృతి చేసుకున్నారు.

# గడువులోగా కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ ఇవ్వండి

## ఐ అండ్ పి ఆర్ కమీషనర్ ముకుంద రెడ్డిని కోరిన జర్నలిస్టు సంఘాల నేతలు



హైదరాబాద్ (తెలంగాణ వాణి) జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నేతలు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ పోరాటం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేబుల్ చానెల్స్ జర్నలిస్టులకు ఐఅండ్ పీఆర్ తో పాటు జిల్లాల్లో అక్రెడిటేషన్స్ ఇచ్చేందుకు మెమో నం:321ను జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన నూతన ఆదేశాల మేరకు మే 31 లోపు రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన అందరు కేబుల్ చానెల్స్ జర్నలిస్టులకు నూతన అక్రెడిటేషన్స్ ను ఇవ్వాలని మంగళవారం నాడు సమాచార పౌర సంబంధాల శాఖా కమీషనర్ జి.ముకుంద రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి కోరడం జరిగింది. అర్హులైన కేబుల్ చానెల్స్ ను లిస్ట్ ఔట్ చేస్తున్నామని, మే 31 లోపు కేబుల్ చానెల్స్ జర్నలిస్టులకు అక్రెడి టేషన్స్ ఇచ్చేందుకు కృషి చేస్తామని కమీషనర్ ముకుంద రెడ్డి తెలిపారు. ఐ అండ్ పి ఆర్ కమీషనర్ ను కలిసిన వారిలో తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, వి5 న్యూస్ ఛానెల్ సీఈఓ కడకంచి వెంకటేష్, టీఎన్ ఎన్ సీఈఓ దేవేందర్, స్టూడియో 18 భరత్ కుమార్, ఎబి న్యూస్ సీఈఓ బ్రహ్మాచారి పలువురు కేబుల్ చానెల్స్ జర్నలిస్టులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



యాదాద్రి భువనగిరి : ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## మహబూబాబాద్ జిల్లాలో

# అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



బయ్యారం : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సింగారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని గార్ల బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సందర్శించారు. స్థానికల వద్ద నుంచి వివరాలు సేకరించారు. అయితే గత రెండు సంవత్సరాల క్రితం గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోట పోటీగా అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు చేయగా ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకోగా కొన్ని రోజులపాటు విగ్రహాల ఆవిష్కరణ వాయిదా పడింది. అనంతరం వేరువేరుగా రెండు విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మాజీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించిన అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యేక పోలీసు బలగాలు గ్రామానికి చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అంగన్వాడి కేంద్రాలలో పోషకాహార పంపిణీ..



రాయికల్: మే 05(తెలంగాణ వాణి):రాయికల్ మండలంలోని రాయికల్,ఇటిక్యాల,రామారావు పల్లె అంగన్వాడీ కేంద్రాలలో సీడీపీఓ జయప్రద ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సందర్భంగా గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు,మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు బరువులు ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కలిగించి వారికి 25 రోజులకు ఇంటికి సరుకులు బియ్యము పప్పు నూనె గుడ్లు,పాలు బాలామృతము బాలామృతం ప్లస్సు మురుకులు ఇంటికి ఇవ్వడము జరిగింది. అనంతరం సిడిపిఓ జయప్రద తల్లులకు ఎండలు బాగా ఉన్నందున పిల్లలు,తల్లులు తీసుకొనవలసిన జాగ్రత్తలు ఎక్కువసార్లు పానీయాలు వాటరు కొబ్బరి నీళ్లు తాగించవలెనని,తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామారావు పల్లె సర్పంచ్ రాజేందర్,సూపర్వైజర్స్ మమత,అనూహ్య,అంగన్వాడి టీచర్స్ సుజాత,అనురాధ,రమ్య,ఈ.సుజాత, ఆయమ్మలు,గర్భవతులు బాలింతలు తల్లులు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## 'మార్కెట్ డిమాండ్ బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి': ఎమ్మెల్సీ

మర్రిగూడ: తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లెంకలపల్లి గ్రామంలో మంగళవారం ఎం.ఏ.ఆర్ ఫంక్షన్ హాల్‌లో రైతు సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ కామ్రేడ్ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు పండించే పంటలలో మార్పులు తీసుకురావడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా పామాయిల్ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సాయం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేయాలని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలన్నారు.

# బిజెపికి మరింత శక్తి!



బెంగాల్,తమిళనాడు, కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బిజెపికే లాభించింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. కేవలం కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమత, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. బిజెపికి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా..అందరి దృష్టి కేవలం బెంగాల్‌పైనే ఉంది. బెంగాల్లో మమతా బెనర్జీని బిజెపి మట్టికరిపిస్తుందా లేదా అని ఎదురు చూశారు. అనుకున్నట్లుగానే, మోడీ, అమిత్ షా ద్వయం బెంగాల్లో కూడా పాగా వేశారు. అస్సాంలో పట్టు నిల్పుకున్నారు. కలకత్తా కాళీ కరుణించింది. బిజెపికి పగ్గాలు అప్పగించిది. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడా మార్పు కోసం యత్నించ నుంది. దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బిజెపి, కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం పడగా, తమిళనాడులో టివికె పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారం దక్కించుకోబోతోంది. ఇక్కడ డిఎంకె మళ్లీ విజయం సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. కేరళంలో దశాబ్దం తరవాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రాబోతోంది. ఇక అసోం, పాండిచ్చేరిలో బిజెపి అధికారం నిలుపుకుంది. మొత్తంగా బెంగాల్లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చూడాలి. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళం విజయం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. తమిళనాట పార్టీ పెట్టిన రెండేళ్లలోనే అధికారం చేపట్టబోతున్న విజయ్ ఓ రకంగా చరిత్ర సృష్టించారనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు కేవలం దక్షిణాది, హిందీ వ్యతిరకత ప్రదర్శించిన డిఎంకెకు ప్రజలు గుపాఠం చెప్పారు. బెంగాల్లో మమతా బెనర్జీ ఏకపక్ష రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో అవినీతి, అధికార దురహంకారం పెచ్చుమీరాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన బెంగాల్లో మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా తయారు చేసుకున్నారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఓట్ల కోసం అక్రమ చొరబాటుదారులను చేరదీశారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు మంజూరయ్యాయి. బంగ్లా వసలదారుల పెత్తనంలో సొంత రాష్ట్రం ప్రజలు నలిగిపోయారు. పరాయి ప్రజలుగా మారారు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యం అయ్యాయి. ఇవన్నీ ఎదరించిన వారిని మట్టుపెట్టారు. దాడులు, విధ్వంస రచన సాగింది. అందుకే వీటిలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేకుంటే మమత పాలనకు బీజేపీ చరమ గీతం పాడనుందా? అంటూ ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దాదాపు 50 ఏళ్ల పాటు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించాయి. 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని ఏలాయి. కానీ ఈ సారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడంతో అక్కడ కొత్త చరిత్ర లిఖితం కాబోతోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడించింది. ఆ సమయంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపుగా ఐదేళ్లుగా అక్కడ బిజెపి వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. అందుకు ఫలితం దక్కింది. బెంగాల్లో బిజెపి కాషాయ జెండా ఎగరేయడం ఓ చరిత్రగా చూడాలి. ఇకపోతే ఈ విజయం ఓ రకంగా మోడీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై

ధీమాగా ఉన్నప్పటికీ ప్రజలు ఛీకొట్టారు. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అనిచాటుకుంది. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇక విజయోత్సవాల్లో పాల్గొనడానికి వస్తామని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. కానీ ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. ఇక కేరళ విషయానికి వస్తే ఎన్నికల అయిపోగానే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించు కున్నారు.. వృద్దాప్యంతో పాటు పలు అవినీతి, కుంభకోణాల కారణంగా అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ లేదా యూడిఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత పదేళ్లుగా సినరయ్ విజయ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడిఎఫ్‌కు మళ్లీ అధికారం దక్కడం ఖాయమయ్యింది. ఇక తమిళనాడు లో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. అనూహ్యంగా ఆయనే కింగ్ అయ్యారు. అయితే పూర్తి మెజార్టీకి దూరంలో ఉన్నారు. దీంతో ఇతర పార్టీలతో జట్టుకట్టక తప్పనిపరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో అన్న డిఎంకె కూడా రెండోస్థానంతో సత్తా చాటింది. ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మెజారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ గెలవడంతో ఇప్పుడు తమిళనాడులో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. మొత్తంగా ఫలితాలు బిజెపిలో ఆశావహ దృక్పథాన్ని నిలిపాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంత తోడ్పడిందనే చెప్పాలి.

## అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



రాంనగర్: ముషీరాబాద్ కావిడిగూడ భోలక్ పూరలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు ముఠా గోపాల్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేస్ట్ ప్లాస్టిక్ మెటీరియల్ స్టోరేజ్ గోదాం, షాపులు, భవనాన్ని సందర్శించి జరిగిన అగ్ని ప్రమాద వివరాలు భవనాల్లో ఉన్నటువంటి కుటుంబాల ద్వారా తెలుసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగలేదని ఇద్దరికీ పొగతో కొంత ఇబ్బంది కలగడంతో సత్వరమే సరోజినీ దేవి ఆసుపత్రి అలాగే గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నామని తెలిపారు.ముందుగా ఎక్కడికక్కడే విద్యుత్ సరఫరాను నిలిపివేసి భవనాల్లో ఉన్నటువంటి వారిని సత్వరమే ఖాళీ చేయించడం జరిగిందని తెలిపారు. వేసవి కావడంతో ఎక్కువగా విద్యుత్ వాడకం వలన షార్ట్ సర్క్యూట్ అవటం జరిగిందని విద్యుత్ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి అధికారులు జరిగిన అగ్ని ప్రమాదంపై సత్వరమే నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ పుష్పలత, విద్యుత్ శాఖ ఏడి శ్రీనివాస్, తహసీల్దార్ చందన, ఆర్ అండ్ బి, ఫైర్, జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో మూడో ఫ్రంట్ సాధ్యమేనా?

నెల్లూరు,: ఏపీలో కొత్త పార్టీ రాబోతోందా. అది కూడా ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సీనియర్ పోలీస్ అధికారి పీవీ సునీల్ కుమార్ నాయకత్వంలో వస్తోందా. అసలు ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేయాల్సిన అనివార్యత ఉందా. అందుకు రాజకీయ వాతావరణం కలసి వస్తుందా ఇవన్నీ ప్రశ్నలు. వీటికి జవాబు పీవీ సునీల్ కుమార్ ఇంటర్వ్యూలో పూర్తి క్లారిటీతో ఇచ్చారు. ఏపీలో తాను కొత్త పార్టీ చేస్తానా లేదా అన్నది భవిష్యత్తు నిర్ణయిస్తుంది అని ఆయన చెప్పడం విశేషం. తాను రాజకీయ పార్టీ ఏర్పాటు చేయను అని ఆయన ఎక్కడా చెప్పలేదు. అదే సమయంలో రాజకీయ పార్టీ ఏర్పాటు అవసరం ఉందనే అంటున్నారు. దళితుల హితం తన అజెండా అని ఆయన చెప్పారు. దళితుల ఉద్ధరణ కోసం వారికి రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా సముచితమైన స్థానం కోసం కొత్త రాజకీయం అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి దళితులు ఓటు వేసే వారుగానే ఉండిపోయారు తప్ప రాజ్యాంగబద్ధమైన పదవులు అందుకోలేకపోయారు అని ఆయన అన్నారు. ఈ రాష్ట్రంలో ఎవరికి ఓటు వేసినా దళితుల స్థితిగతులు మారలేదని ఆయన చెప్పుకొచ్చారు. పదహారు శాతం పైగా ఓటు షేర్ కలిగిన దళితులకు రాజకీయ అధికారం తప్పనిసరిగా కావాల్సి ఉందని సునీల్ కుమార్ నొక్కి చెప్పారు. తాను ప్రధాన రాజకీయ పార్టీలలో చేరి వాళ్ళ నుంచి బీఫారం తీసుకుని బానిసగా మాత్రం బతకను అని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో కొత్తరాజకీయ పార్టీ అవసరం ఉందని అన్నారు. రాజకీయాలు డైనమిక్ అని ఎపుడు ఏమి జరుగుతుందో తెలియదు అన్నారు కాబట్టి తాను పార్టీ పెడతానా లేదా అన్నది వేచి చూడాలని అన్నారు. తాను రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఎవరికి నష్టం లాభం అన్నది తనకు అనవసరం అని సునీల్ కుమార్ చెప్పారు. దళితులు బాగుపడడమే తన లక్ష్యమని అదే తన టార్గెట్ అని కూడా నొక్కి చెప్పారు. ఏపీ రాజకీయాల్లో సామాజిక రాజకీయ మార్పు రావాల్సి ఉందని సునీల్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో కాపులు పెద్ద సంఖ్యలో ఉన్నారని వారి తరువాతా అత్యధిక సంఖ్యలో దళితులు ఉన్నారని ఆయన చెప్పారు. ఈ రెండు సామాజిక వర్గాలు కలిస్తే కనుక యాభై శాతం కంటే ఎక్కువ ఓటు బ్యాంక్ తమది అవుతుందని అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు అయితే సాగుతున్నాయని అన్నారు. అది తనతోనే కాదని 2005 నుంచి ఈ ఆలోచనలు ఉన్నాయని సునీల్ కుమార్ చెప్పడం విశేషం. సరైన సమయం వస్తే కచ్చితంగా ఈ ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయని కూడాఆయన ఆశాభావంగా చెప్పారు.మాల మాదిగల మధ్యన కూడా విభేదాలు లేవని ఇపుడు అంతా ఒక్కటిగానే ముందుకు వస్తున్నారని ఆయన చెప్పారు రాష్ట్రంలో కాపులకు దళితులకు మధ్య సామరస్య వాతావరణమే ఉందని సునీల్ కుమార్ చెప్పారు. ఒక చుండూరు ఒక కారంచేడు లాంటి ఘటనలు అయితే ఎక్కడ కాపులు చేయలేదని అన్నారు. చిన్న పాటి గొడవలు మాత్రమే ఉన్నాయని అవన్నీ పట్టించుకోవాల్సింది లేదని అన్నారు. ఏపీలో కాపులకు ఐకాన్ గా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉన్నారని యాంకర్ గుర్తు చేసినపుడు సమయం వచ్చినపుడు ఎవరిని కలవాలో అందరినీ కలుస్తామని సునీల్ కుమార్ బదులిచ్చారు. దీనిని బట్టి చూస్తే ఫ్యూచర్ లో కాపులు ప్లస్ దళితులతో కొత్త పార్టీ రావచ్చు అన్న చర్చ అయితే సాగుతోంది.

## కూకట్ పల్లి, ప్రగతి నగర్ లో సగం ఇళ్లు ఖాళీ..

హైదరాబాద్, : హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ దూకుడు బ్రేకుల్లేని బండిలా దూసుకుపోతూంటే, కూకట్ పల్లిని ఆనుకుని ఉన్న ప్రగతీనగర్ పరిసర ప్రాంతాల్లో మాత్రం వింత పరిస్థితులు నెలకున్నాయి. ముఖ్యంగా ప్రగతీ నగర్, నిజాంపేట్‌లో లోల్డ్ అపార్ట్మెంట్‌లలో ఫ్లాట్లు కొనేందుకు ఆసక్తి చూపేవారు లేక, ఇటు ఓనర్స్ , అటు దళారీలు చుక్కలు చూస్తున్నారు. ఫ్లాట్ ఫర్ సేల్ అని బోర్డు పెట్టి నెలలు గడుస్తున్నా, వామ్మో ఈ ఫ్లాట్లు మాకొద్దంటూ కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గత ఏడాదిన్నర కాలంగా ఈ ప్రాంతాల్లో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. 12ఏళ్ల క్రితం బ్యాచిలర్స్ గా ఉన్నప్పుడు కొనేశాం. ఇప్పుడు ఇక్కడ అమ్మేద్దాం అంటే కొనేవాళ్లు లేరంటూ ఇంటి ఓనర్స్‌లో నిరుత్సాహం నెలకొంది.కూకట్‌పల్లిని ఆనుకుని, ఐటీ కంపెనీలకు అందుబాటు దూరంలో ఉన్న ప్రగతీ నగర్, నిజాంపేట్ ప్రాంతాల్లో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనాలంటే తక్కువలో తక్కువ 40లక్షలకుపైగా చెల్లించాలి. డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ఐతే జీఎస్‌టీతో కలిపి 85 లక్షలకుపైమాటే, అయితే ఇంత ఖర్చు చేసి కొందామంటే, ఇప్పటికే ఆ నిర్మాణాలు 15ఏళ్ల క్రితం కట్టినవి కావడంతో అన్ని లక్షలు పోసి, మరీ అంత పాత ఫ్లాట్లు అవసరమా అనే ఉద్దేశ్యంతో లైట్ తీసుకుంటున్నారు కొనుగోలుదారులు.ఈ ప్రాంతాల్లో ఇళ్లు పాత నిర్మాణాలని అనుకుంటున్న సమయంలో మూలిగే నక్కపై హైడ్రా బుల్డోజర్ పడ్డట్టు, ప్రగతీ నగర్, నిజాంపేట్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా భయం ఫ్లాట్ల కొనుగోలు, అమ్మకాలపై స్పష్టంగా కనిపిస్తోంది. అపార్ట్మెంట్‌లో ఫ్లాట్ కొందామంటే, పంచాయితీ అనుమతితో ఎప్పుడో నిర్మించారు, ఏ చెరువు పరిధిలో ఆక్రమణ అని హైడ్రా కూల్చేస్తే, మొత్తానికి మునిగిపోతామనే భయం వినియోగదారులను వెంటాడుతోంది. దీంతో సాధారణ రోజుల్లో జరిగే అమ్మకాల్లో కనీసం 15శాతం కూడా జరగడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఇదిలా ఉంటే ఆది నిష్టూరం కంటే అంత్య నిష్టూరం మేలన్నట్లు, నెలల తరబడి వేచి ఉంటే అక్కడక్కడా, అరకొరగా ఫ్లాట్లు అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా అపార్ట్మెంట్ నిర్మించిన ఏడాది ఆధారంగా కొనుగోలు చేసే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. 6ఏళ్ల క్రితం కట్టిన నిర్మాణాలు కొనేందుకు మాత్రమే ఆసిక్తి చూపుతున్నారు. దీంతో 10ఏళ్లు దాటిన నిర్మాణాలు, ఫ్లాట్ ఫర్ సేల్ అంటూ పెట్టిన బోర్డులు నెలల తరబడి, ఎండకు ఎండి, వానకు తడిచిపోతున్నాయే తప్ప. ఈ ప్రాంతాల్లో ఏజ్ బార్ ఫ్లాట్లు మాత్రం అమ్ముడుకావడంలేదు.నేను గత 24 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు ప్రగతీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల కొనుగోళ్లు 50శాతంపైగా నిలిచిపోయాయి. హైడ్రా ఏర్పాటు చేసిన నాటి నుంచి ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. చెరువుకు దూరంగా ఉన్నా కొనేందుకు వెనకాడుతున్నారు. హైడ్రా క్లియరెన్స్ సర్టిఫికేట్ ఉందా అని అడుగుతున్నారు. 3వ ఫ్లోర్‌కు రిజిస్ట్రేషన్స్ లేకపోవడంతో కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. అనుమతులు లేకుండా నిర్మించి ఫ్లోర్ లు కొనాలంటే లోన్లు రావడంలేదు.

ఎక్కువ శాతం మంది లోన్ ద్వారానే ఇళ్ల కొనుగోలు చేస్తుంటారు.

-మహ్మద్ అబ్దుల్ నబీ, ప్రగతీనగర్, హైదరాబాద్నేను 20ఏళ్లుగా రియల్ ఎస్టేట్ లో ఉన్నాను. 40లక్షల నుంచి 60 లక్షల బడ్జెట్ లోపు ఇళ్ల అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 10ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లు 32లక్షల నుంచి 40లక్షల లోపు సింగిల్ బెడ్ రూమ్ ధర పలుకుతోంది. ఇప్పుడు ఇంటి అద్దెలు కూడా పెరగడంతో కొంత మంది కొని ,ఇళ్లు అద్దెకు ఇచ్చేస్తున్నారు. నిజాంపేట్ పరిధిలో ఇళ్ల అమ్మకాలు, కొనుగోళ్లు విపరీతంగా తగ్గాయి. మేం ఇళ్లు అమ్మాలని చూస్తుంటే కొనేవాళ్లు రావడంలేదు. ఒకవేళ కొనడానికి ముందుకొచ్చినా, వాళ్లు చెల్లించే ధర , మేం అనుకున్న దానికంటే చాలా తక్కువగా ఉంటోంది. దీంతో ఏళ్ల తరబడి కొన్ని ఇళ్లు సేల్ బోర్డులతోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

## ట్రయిల్ రన్ లో ఓపీ..



హైదరాబాద్, : మెడికల్ సైన్సెస్ లో అవుట్ పేషెంట్ సేవలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు ట్రయల్ రన్ (ప్రయోగాత్మక నిర్వహణ)లో భాగంగా ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రయోగాత్మక దశలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఓపీ మరియు డయాగ్నోస్టిక్ (వ్యాధి నిర్ధారణ పరీక్షలు) సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సమయంలో వచ్చే రోగులకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన ప్రాథమిక పరీక్షలు కూడా అక్కడే నిర్వహిస్తారు. ఈ నెల రోజుల ట్రయల్ రన్ ద్వారా ఆసుపత్రి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను గుర్తించి, భవిష్యత్తులో పూర్తిస్థాయి సేవలను ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించాలని అధికారులు భావిస్తున్నారు.సాధారణ ప్రభుత్వాసుపత్రులకు భిన్నంగా టిమ్స్ సనత్‌నగర్‌లో 22 రకాల వైద్య విభాగాలు కొలువుదీరాయి. ఇందులో ప్రధానంగా ఏం ఉన్నాయంటే..?: కార్డియాలజీ (గుండె సంబంధిత), న్యూరాలజీ (నరాల సంబంధిత), నెఫ్రాలజీ (కిడ్నీ సంబంధిత), గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్ – జనరల్ సర్జరీ. ఈ కీలక విభాగాలతో పాటు మరికొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు కూడా ఈ ట్రయల్ రన్‌లో భాగం కానున్నాయి. ఇప్పటికే ఆయా విభాగాలకు అవసరమైన నిపుణులైన వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని ప్రభుత్వం అక్కడ నియమించింది.రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఓపీ సేవల కోసం అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని?. మందుల లభ్యత మరియు పరీక్షల నిర్వహణలో సమన్వయం ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.నగరంలోని నాలుగు దిక్కులా టిమ్స్ ఆసుపత్రులను నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా సనత్‌నగర్ టిమ్స్ కీలక అడుగు వేసింది. ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులపై ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

### హైదరాబాద్‌లో కిడ్నాప్ కలకలం.. తల్లి ఒడిలో నిద్రిస్తున్న పాపను ఎత్తుకెళ్లిన దుండగులు

హైదరాబాద్ : హైదరాబాద్ లో చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పక్కన అర్ధరాత్రి తల్లి ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న మార్బుల్ షాపు వద్ద ఆదివారం అర్ధరాత్రి నవనీత అనే మహిళ తన నలుగురు పిల్లలతో నిద్రిస్తున్నది. తల్లి నిద్రలో ఉన్న సమయంలో ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారి ఆశను ఎవరో దుండగులు ఎత్తుకెళ్లారు. కాసేపటికి మెలకువ వచ్చిన నవనీత చుట్టుపక్కల వెతకగా పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. వెంటనే కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

## జేబులు ఖాళీ చేస్తున్న క్యాబ్ దందా




హైదరాబాద్, : సామాన్యులు భాగ్యనగరంలో క్యాబ్‌లు, ఆటోల్లో ప్రయాణించాలంటే దడ పుట్టించే ధరలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అగ్రిగేటర్ సంస్థలు, డ్రైవర్లు అడ్డగోలుగా ఛార్జీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయిఒక ప్రయాణికుడు ఒకే మార్గంలో తరచుగా ప్రయాణిస్తుంటే, సదరు యాప్ అల్గారిథమ్ దానిని విశ్లేషించి ధరను పెంచుతోంది. గతంలో రూ. 200 ఉన్న రూట్లలో ప్రస్తుతం రూ. 350 వరకు వసూలు చేస్తున్నారు. పీక్ అవర్స్‌లో ఒక్కో ప్రయాణంపై రూ. 200 నుండి రూ. 300 వరకు అదనంగా భారం పడుతోంది.గ్యాస్, డీజిల్ కొరత పేరుతో డ్రైవర్లు ప్రయాణికుల నుండి అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

క్యాబ్ బుక్ అయిన తర్వాత ఫోన్ చేసి గమ్యస్థానాన్ని అడిగి, ఎక్కువ ఇస్తేనే వస్తామని షరతులు విధిస్తున్నారు. తెల్లవారుజామున లేదా రాత్రి వేళల్లో రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులకు వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని యాప్‌లో ఉన్న ధర కంటే రెండు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏసీ ఆన్ చేయడానికి కూడా అదనపు ఛార్జీలు డిమాండ్ చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణం ఖరారు చేసుకునే ముందు యాప్‌లో ధరను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి.

ధర విషయంలో డ్రైవర్లకు ముందే స్పష్టత ఇవ్వడం ద్వారా అదనపు వసూళ్లకు అవకాశం ఉండదు. ఒకే యాప్‌పై ఆధారపడకుండా వేర్వేరు యాప్‌లను వాడటం వల్ల రాయితీలు పొందే వీలుంటుంది. డ్రైవర్ అనుచితంగా ప్రవర్తిస్తే యాప్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా వారికి రేటింగ్ తగ్గుతుంది. క్యాబ్‌ల అధిక ధరలపై స్పందించిన హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఓటర్ విలక్షణ తీర్పు...



అధికారంలో ఉన్న పార్టీలు.. అభివృద్ధిని చేసి చూపించాలి. అంతేగానీ.. సంక్షేమ పథకాలు ఇస్తే సరిపోదు. ప్రజలు అలాంటి పార్టీలను తిరస్కరిస్తున్నారు బెంగాల్‌లో మోదీ ఎన్నికలకు ముందు.. మహిళల అకౌంట్లలో మనీ వేశారు. దాంతో మహిళల ఓట్లు తమకే అనుకున్నారు. అడ్డంగా ఫెయిల్ అయ్యారు. ఏపీలో వైసీపీ కూడా పథకాల ద్వారా గెలుస్తామని అనుకుంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో డీఎంకే కూడా ఇలాగే దెబ్బైపోయింది. తెలంగాణలో బీఆర్ఎస్ కంటే.. ఎక్కువ పథకాలను ప్రకటించిన కాంగ్రెస్‌ని ప్రజలు గెలిపించారు. ఏపీలోనూ అదే జరిగింది. ప్రజలు పథకాలు ఎవరైనా ఇస్తారు.. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఓటు అంటున్నారు. అదే సమయంలో.. పథకాలు మాత్రమే ఇస్తే, అలాంటి పాలనకు స్వస్తి పలుకుతున్నారు. అందువల్ల ఓటర్లను తక్కువ అంచనా వేసే పార్టీలకు షాకులు తప్పట్లేదు. తాజా ఫలితాలు ఇదే తెలియజేస్తున్నాయి. ప్రతీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటాయి. అవి జాతీయ పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో అధికారానికి రానివ్వకుండా చూసుకుంటాయి. కానీ.. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ, ఎన్డీయే సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాంతీయ పార్టీలు గల్లంతవుతున్నాయి. ఇందుకు బీజేపీ వ్యూహాలు ఒక కారణమైతే, ఆ పార్టీల స్వయంకృత అపరాధాలు మరో కారణం. జమ్మూకాశ్మీర్‌లో ఎన్సీ, హర్యానాలో ఒడిశాలో బిజూ జనతాదళ్, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్, బెంగాల్‌లో తృణమూల్, కర్ణాటకలో జేడీఎస్, మహారాష్ట్రలో శివసేన ఇలా ఎన్నో ప్రాంతీయ పార్టీలు.. తమ ఉనికిని కోల్పోతున్నాయి. అధికారానికి దూరమై, కనీసం ప్రతిపక్షాలుగా కూడా ప్రభావం చూపలేకపోతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభావం చూపలేకపోతోంది. మరికొన్ని సందర్భాల్లో.. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు బలహీనపడుతున్నాయి. ఇక్కడ బీజేపీ తన ఎదుగుదలకు పునాదిని నిర్మించుకుంటోంది. అది ఆ పార్టీలకు సమస్య అవుతోంది. కచ్చితమైన విధానాలు, సిద్ధాంతాలు, పట్టుదల, బలమైన వ్యూహాల వంటివి కమలం ఎదుగుదలకు కారణం అవుతున్నాయి. మొన్నటిదాకా బీహార్‌లో బలంగా ఉన్న జేడీయూ.. ఇప్పుడు బీజేపీకి అధికారాన్ని అప్పగించుకుంది. ఐతే.. సౌత్‌లో మాత్రం బీజేపీ పెనట్రేట్ అవ్వలేకపోతోంది. కర్ణాటక తప్పితే.. మిగతా రాష్ట్రాల్లో ప్రభావం చూపలేకపోతోంది. భాషా ప్రాంతీయతా భావం ఇక్కడ బలంగా ఉండటం కమలానికి సవాల్ అవుతోంది. అయినప్పటికీ.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ విస్తరిస్తున్న తీరు మాత్రం.. సంచలనమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఒక కొత్త విషయాన్ని గ్రహించవచ్చు. ఏపీలో జనసేన పార్టీ ఒంటరిగా పోటీ చెయ్యకుండా.. టీడీపీతో కూటమిగా పోటీ చేసి.. గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ పొత్తు వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలలేదు. కానీ తమిళనాడులో విజయ్ ఇలా చెయ్యలేదు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. దాంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలినా.. ఎక్కువ ఓట్లు తనకే దక్కేలా చేసుకున్నారు. ఫలితంగా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఇప్పుడు టీవీకే అవతరించింది. మెజార్టీ మార్క్ రాకపోయినా.. మరో 10 సీట్లతో పవర్ లోకి వచ్చేయవచ్చు. ఇందుకోసం చిన్న చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవచ్చు. ఇలా ఒంటరిగా పోటీ చేసి బలమైన పార్టీగా ఎదగడం వల్ల ఇప్పుడు టీవీకే.. సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితిని తెచ్చుకుంది. ఈ ఛాన్స్ జనసేన తెచ్చుకోలేకపోయింది. ఏపీలో ఇప్పుడు జనసేన.. రెండో పెద్ద పార్టీగా ఉంది. కానీ.. టీడీపీతో పోల్చితే.. జనసేనకి ఉన్నవి 21 సీట్లే. నెక్స్ట్ ఎన్నికల్లో ఆ పార్టీ బలంగా ఎదగాలంటే.. ఒంటరిగా పోటీ చెయ్యాల్సి ఉంటుంది. కానీ.. 15 ఏళ్లు పొత్తుతోనే వెళ్తామని చాలాసార్లు డీసీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. అలా పొత్తుతో వెళ్లినంతకాలం.. జనసేన ఎదిగే అవకాశాలు ఉండవు. సీట్ల సర్దుబాటులో.. కొన్ని సీట్లతోనే సర్దుకోవాల్సి ఉంటుంది. అలాగే పవన్ కళ్యాణ్ సీఎం అయ్యే చాన్స్ కూడా మిస్సవుతుంది. అందుకే విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా.. ఇప్పుడు సీఎం అయ్యే ఛాన్స్ పొందారు. ఇదే జనసేనకి మైనస్ అవుతుంటే.. విజయ్‌కి ప్లస్ అయ్యింది. అఫ్‌కోర్స్ తమిళ పాలిటిక్స్ వేరు, మన ఏపీ పాలిటిక్స్ వేరు.. కానీ పరిస్థితులు అలా అయ్యాయని అనుకోవచ్చువిజయ్ వంటి కొత్త నాయకుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టడం, ఆయన పార్టీకి వచ్చిన ఆధిక్యాలు చూస్తే, సహజంగానే అందరి దృష్టి పడింది. దీని నుంచి అనుభవజ్ఞులైన నాయకులు సైతం గమనించగల కొన్ని విస్తృత రాజకీయ పాఠాలు ఉన్నాయి. ముఖ్యమైన పాఠాలలో ఒకటి కథనం, భావోద్వేగ అనుబంధ శక్తి. విజయ్ పట్ల ఆదరణకు కారణం, సంవత్సరాల తరబడి జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్న తెరపై ఆయన ఉనికి. ఇది పెద్ద సంఖ్యలో మద్దతుదారులతో ఒక సిద్ధమైన భావోద్వేగ బంధంగా రూపాంతరం చెందింది. సినిమాల్లో ఆయన చెడును ప్రశ్నించే ధోరణి.. ప్రభుత్వాలకు ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా నడుచుకునే ధోరణి.. ప్రాంతీయ తత్వం, ద్రవిడ వాదాన్ని బలపరిచింది. బీజేపీని వ్యతిరేకించేవారికి.. విజయ్ బలమైన సపోర్టర్‌గా నిలిచాడు. మరొక అంశం ప్రసంగాలు. విజయ్ ప్రసంగాలన్నీ దూకుడుగా, సూటిగా, సుత్తిలేకుండా సాగాయి. అలాగే.. ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశాయి. పూర్తిగా డీఎంకేని బలంగా టార్గెట్ చేశారు. దాంతో డీఎంకేని వ్యతిరేకించేవారికి.. విజయ్.. బలమైన ఆల్టర్నేట్‌గా కనిపించాడు. అదే సమయంలో అన్నాడీఎంకే.. అంతర్గత కల్లోలాలతో.. బలమైన నాయకత్వాన్ని ప్రజలకు చూపలేకపోయింది. దీంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు.. టీవీకేకి షిఫ్ట్ అయ్యింది. మన తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు.. ఓట్లు వేస్తారనే గ్యారెంటీ లేదు. ఈ కారణంగానే ఇదివరకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. రెండుచోట్ల పోటీ చేసి కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఈ లోటును గుర్తించిన ఆయన.. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అభిమానులను.. అభిమానం కాదు.. ఓటు వెయ్యాలి అని పదే పదే చెప్పడం వల్ల.. 100 శాతం స్ట్రైక్ రేటును సాధించగలిగారు. తమిళనాడులో తీరు వేరు అక్కడి ప్రజలు.. సినీ నేతలను విపరీతంగా అభిమానిస్తారు. అందువల్ల ఎన్నికల్లో పాల్గొనగానే.. బలంగా గెలిపిస్తారు. ఇది విజయ్‌కి బాగా సెట్ అయ్యింది. విజయ్ ఈ గెలుపు.. 27 నెలలది మాత్రమే కాదు. కొన్నేళ్లుగా ఆయన నిర్మించుకున్న అభిమాన సౌధానికి ఇది ప్రతిఫలం లాంటిది. బీజేపీకి వ్యతిరేకంగా ఆయన వినిపించిన వాణికి ఇది ప్రాంతీయ భాషా సపోర్టర్ల నుంచి వచ్చిన సపోర్టు లాంటిది. ఇలా విజయ్ వ్యక్తిత్వం, నాయకత్వం, మాట్లాడే తీరు, నడుచుకునే వ్యవహార శైలి అన్నీ కలిసి.. ఈ విజయం దక్కేలా చేశాయి. మరో వైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ మార్క్ రాక, 240 సీట్లకే పరిమితమైన బీజేపీ.. ఆ తర్వాత పుంజుకున్న విధానం ఓ చరిత్ర. వరుసపెట్టి మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ ఇలా చాలా రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తూ.. ఇప్పుడు 42 లోక్ సభ స్థానాలున్న బెంగాల్‌ని తమ సొంతం చేసుకుంది. అలాగే.. అసోం, పుదుచ్చేరిలో పట్టు నిలుపుకుంది. ఇది బీజేపీకి పెద్ద బూస్ట్. కమలానికి ఇదెలా సాధ్యమవుతుంది అంటే.. సింపుల్ ఆన్సర్ ఉంది. మిషన్ మోడ్. మిగతా పార్టీలు ఎన్నికలు వచ్చినప్పుడే.. మిషన్ మోడ్‌లో ఉంటాయి. బీజేపీ అలా కాదు.. ఎప్పుడూ అలాగే ఉంటుంది. చిన్న ఎన్నికను కూడా ఆ పార్టీ తేలిగ్గా తీసుకోదు. దేశమంతా తామే విస్తరించాలనే బలమైన కోరిక ఆ పార్టీని ముందుకు నడిపిస్తోంది. దానికి తోడు బలమైన సైద్ధాంతిక పునాది, హిందుత్వ వాదం, దేశభక్తి.. ఇవన్నీ కలిసి.. ఆ పార్టీని మిషన్ మోడ్‌లో ఉంచున్నాయి. వీటికి తోడు ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం.. నిరంతరం వ్యూహాలు రచిస్తూ.. పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారు. నెక్స్ట్ తెలంగాణపై కమలం ఫోకస్ ఉండటంతో.. ఇక్కడి స్థానిక పార్టీల్లో ఇది కొంత కలవరం కలిగించే అంశంగా చెప్పుకోవచ్చు. ఐతే.. తెలంగాణలో బీజేపీ ఎదగగలదా అనేది అప్పుడే చెప్పలేం. ప్రస్తుతానికి తెలంగాణలో ఆ పార్టీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ తర్వాత మూడో స్థానంలో ఉన్నట్లు కనిపిస్తోంది. అందువల్ల టాప్‌కి చేరడం అంత తేలిక కాదు, అలాగని అసాధ్యమూ కాదు. ఇకపై తెలంగాణ పాలిటిక్స్ మరింత ఉధృతంగా ఉండటం ఖాయమనుకోవచ్చు.

# దళపతి విజయ్ సెన్సేషన్..

## రాజకీయ విజయంతో వెలుగులోకి వచ్చిన ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ విశేషాలు

చెన్నై: కోలీవుడ్ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించారు. అభిమానుల గుండెల్లో "దళపతి"గా ప్రత్యేక స్థానం సంపాదించిన విజయ్, రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్ పొలిటీషియన్‌గా మారి తొలి ఎన్నికల్లోనే తన పార్టీ తమిళగ వెట్రి కళగంను విజయతీరాలకు చేర్చడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో విజయ్ వ్యక్తిగత జీవితం, కుటుంబ నేపథ్యం గురించి నెటిజన్లు విస్తృతంగా తెలుసుకోవాలనుకుంటున్నారు. విజయ్ సినీ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లి శోభ చంద్రశేఖర్ గాయని, రచయిత్రి, నిర్మాతగా కూడా పనిచేశారు. తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్ ప్రముఖ దర్శకుడు, నిర్మాత, రచయిత. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో 70కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి, తనదైన ముద్ర వేశారు. విజయ్ తల్లిదండ్రులకు తెలుగు సినీ పరిశ్రమతో మంచి అనుబంధం ఉంది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవితో కలిసి వారు మూడు బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించారు. 1981లో వచ్చిన చట్టానికి కళ్ళు లేవు చిత్రంతో ఎస్.ఏ. చంద్రశేఖర్ తెలుగు పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇది తమిళ హిట్ మూవీ రీమేక్‌గా రూపొంది మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం 1983లో వచ్చిన పల్లెటూరి మొనగాడు కూడా బాక్సాఫీస్ వద్ద హిట్‌గా నిలిచింది. 1984లో విడుదలైన దేవాంతకుడు కూడా విజయవంతమై, చిరంజీవి కెరీర్‌లో కీలక చిత్రంగా నిలిచింది. ఈ మూడు చిత్రాలకు విజయ్ తల్లి శోభ కథ అందించడం విశేషం. ఇలా విజయ్ కుటుంబం తెలుగు సినిమా అభివృద్ధిలో కూడా తన వంతు పాత్ర పోషించింది. అదనంగా, 'దోపిడీ దొంగలు', 'ఇంటికో రుద్రమ్మ' వంటి మరికొన్ని తెలుగు చిత్రాలకు కూడా చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. విజయ్ చిన్న వయసులోనే చైల్డ్ ఆర్టిస్టుగా తన కెరీర్ ప్రారంభించారు. 1992లో తన తండ్రి



దర్శకత్వంలో వచ్చిన నాలైయ తీర్పు ద్వారా హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత ఒక్కో సినిమాతో తన నటనను మెరుగుపరుచుకుంటూ కోలీవుడ్ టాప్ హీరోలలో ఒకరిగా ఎదిగారు. ఇప్పటివరకు ఆయన సుమారు 69 చిత్రాల్లో నటించారు. తెలుగు దర్శక నిర్మాతలతో ఆయనకు మంచి అనుబంధం ఉన్నప్పటికీ, స్ట్రెయిట్ తెలుగు సినిమా మాత్రం చేయలేదు. అయితే వారసుడు (తమిళంలో 'వారిసు') ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. సినీ రంగంలో అగ్రస్థానంలో ఉన్న సమయంలోనే విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి, తొలి ఎన్నికల్లోనే విజయాన్ని అందుకోవడం విశేషం. ఆయన చివరి చిత్రం గా ప్రచారం జరుగుతున్న జన నాయకుడు త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది.

# తెలుగు వారికి టిపిక్స్ క్లబ్

విజయవాడ, : విదేశాంధ్రుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపిఎనఆర్‌టిఎస్ సంస్థకు మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవి వేమూరు విదేశాంధ్రుల కోసం మరింతగా సేవలందించే విధంగా కొన్ని కార్యక్రమాలను చేపట్టారు. అందులో కూడా ఒకటి. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాల్లో ఉన్నప్పుడు ఎన్నారైలను ఉద్దేశించి ప్రతి ఒక్కరూ ఎంట్రప్రెనూరర్‌లుగా తయారై ఇతరులకు ఉపాధిని కల్పించేలా తయారు కావాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దానిని దృష్టిలో పెట్టుకునే రవి వేమూరు ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించారు. ఈ టింపెక్స్‌తో ఉద్యోగులతోపాటు, ఇంట్లో ఉన్న గృహిణులు కూడా ట్రేడింగ్ నిర్వహించవచ్చని చెప్పారు. ఈ టింపెక్స్‌కు సంబంధించి ఆయన చెప్పిన వివరాలను ఇక్కడ ఇస్తున్నాము. మన దేశంలో గానీ, విదేశాల్లో గానీ వ్యాపారం చేయడంలో ముందుండేవాళ్ళు గుజరాతీలు, తమిళులు. అంతర్జాతీయ వాణిజ్యంలో బలమైన నెట్ వర్క్ లను వారు కలిగి ఉన్నారు. విభిన్న పద్ధతుల్లో మంచి ఆదాయ మార్గాలను అన్వేషించుకొని, వ్యాపారవేత్తలుగా వారు రాణిస్తున్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని తెలుగువాళ్ళతోపాటు, విదేశాల్లో ఉన్న తెలుగువాళ్ళకు కూడా ట్రేడింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తే వారు మరింతగా రాణించి గ్లోబల్ ఎంట్రప్రెన్యూరర్ గా తయారవుతారన్న ఉద్దేశ్యంతో ఏపీఎన్ఆర్టీఎస్ ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించింది. ప్రస్తుతం ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, లిబరైలైజేషన్ (ఎల్‌పిజి) అయిన తర్వాత ఎవరైనా, ఎక్కడైనా వ్యాపారాలు చేసుకోవచ్చు. దానికి అనేక మార్గాలున్నాయి. మన రాష్ట్రంలో, మన దేశంలో ఇంకా చెప్పాలంటే మన ఇంట్లోనే వుంటూ మనం తయారు చేసే వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతులు చేయవచ్చు. చిన్న చిన్న వస్తువులే కాదు.. పెద్ద పెద్ద వస్తువులను కూడా ఎగుమతి చేసి, డబ్బు సంపాదించవచ్చు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యలు, గుంటూరు మిర్చి పండించే రైతులు ఈ విధంగా చేస్తున్నారు. ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను పంపుతున్నారు. లాభాలను ఆర్జిస్తు న్నారు. అయితే.. కేవలం కొన్ని వస్తువులే కాకుండా.. మరిన్ని వస్తువులను కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మంచి అవకాశం దొరికింది. ఈ అవకాశాన్ని ఏపీఎన్ ఆర్టీఎస్ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) కల్పిస్తోంది. ద్వారా మన రాష్ట్రంలోనే వుంటూ గుజరాతీల లాగా, తమిళుల లాగా మనం కూడా బలమైన అంతర్జాతీయ వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం పుష్కలంగా వుంది. ఆసక్తి వున్న వారికి, వ్యాపారవేత్తలుగా ఎదగాలని బలమైన వాంఛ వున్న వారికి అంతర్జాతీయ వాణిజ్యంపై శిక్షణ, అవకాశాలను ఎలా పొందాలి.. గైడెడ్ ట్రేడింగ్ గురించి సంపూర్ణమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ సంస్థ రెడీగా వుంది. ఏపీలో వుండే వారికి ఎంతటి ప్రాధాన్యత వుందో విదేశాంధ్రులకు కూడా అంతే ప్రాధాన్యతను ఇస్తూ.. వారి సంక్షేమం, అభివృద్ధి, వ్యాపార సాధికారత పట్ల కూడా కట్టుబడి వుంది. కేవలం పెద్ద పెద్ద వ్యాపారవేత్తలే కాకుండా సరైన అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలతో చిన్న చిన్న వ్యాపారులు, రైతులు, యువకులు, మహిళలు కూడా అంతర్జాతీయ విపణిలో నిలదొక్కుకునే అవకాశాలను కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు వారిని నంబర్ వన్ గ్లోబల్ కమ్యూనిటీ లీడర్లుగా తీర్చి దిద్దాలని ఏపీ ప్రభుత్వం కూడా సంకల్పించింది. ఉద్యోగిత నుంచి వ్యాపారం వైపు ప్రజలను మార్చాలని నిర్ణయించు కుంది. అయితే తయారీ రంగాలు, పెద్ద వ్యాపారాలతో పోలిస్తే 'ట్రేడింగ'కి భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరమే లేదు. పార్ట్ టైమ్‌గా కూడా నిర్వహించ వచ్చు అని సంస్థ వారు చెబుతున్నారు. అయితే.. ఇందులో ఒప్పందాలు చేసుకునే విధానాలు, అందులో ప్రామాణికత, స్థిరమైన విధానాల ద్వారా సరైన దిశలో సాగేలా మనకు అవకాశాలు, అవగాహన కల్పిస్తారు. ట్రేడింగ్ ప్రారంభంలో వున్న వారు ఇబ్బందులు పడకుండా, వుండేందుకే సహాయ పడుతుంది. గృహిణులు, వారి కుటుంబీకులు కూడా కలిసి సంయుక్తంగా ఏదైనా వ్యాపారాన్ని చేసుకోవచ్చు. తెలుగు ట్రేడర్లు అంతర్జాతీయంగా ఇప్పటికే పాతుకుపోయిన ట్రేడ్ నెట్‌వర్క్‌లతో పోటీ పడాలంటే ఖర్చు కావాలి, అనుభవం కావాలి. ఈ రెంటితో పాటు మరిన్ని మెళకువలను కూడా ౦ఎఖఇచీ.ఇశ్రీబీఎ అందిస్తుంది. అయితే తక్షణంగా వచ్చే లాభాల కంటే పెట్టుబడుల పైనే ఇది ఎక్కువ దృష్టి సారిస్తుంది. పెట్టుబడి భద్రతకు కూడా ప్రాధాన్యతను ఇస్తుంది. తయారీ రంగం లేదా పెద్ద వ్యాపారాలతో పోలిస్తే, ట్రేడింగుకు భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరం లేదు. పార్ట్ టైమ్ ద్వారా కూడా నిర్వహించొచ్చు. ఉత్పత్తుల అభివృద్ధి కంటే వేగంగా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ప్రామాణిక ఒప్పందాలు, స్థిరమైన విధానాల ద్వారా ప్రమాదాలను కూడా తగ్గించొచ్చు. ప్రారంభ దశలో అత్యంత నిపుణత అవసరం లేకపోవడం వల్ల కొత్తగా వ్యాపారంలోకి వచ్చే వారికి ఇది అనుకూల మార్గమని అంటోంది. స్థిర ఆదాయం, అంతర్జాతీయ అనుభవం, విదేశీ మార్కెట్లకు ప్రత్యక్ష పరిచయం ఉన్న ప్రవాసాంధ్రులకు ఇది సహజమైన తదుపరి అడుగు. ఏపీఎన్ఆర్టీఎస్ కార్యక్రమాల ద్వారా తెలియజేసినట్లుగా, నెలలో కొన్ని రోజుల సమయంతో కూడా ఈ వ్యాపారాన్ని నిర్వహించొచ్చు. గృహిణులు, కుటుంబ సభ్యులు కలిసి ఒక సంయుక్త వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించడానికి కూడా ఇది అనువైన అవకాశం అని తెలియజేస్తోంది.

# 'గోల్డ్ షాపులపై నేరగాళ్ల కన్ను.. జాగ్రత్త!'

## డీఎస్పీ కీలక సూచనలు



కోదాడ: ఒక్క నిర్లక్ష్యం భారీ నష్టం జరుగుతుందని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బంగారు షాపుల యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రతపై కీలక సూచనలు చేశారు. ఇటీవల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోల్డ్ షాపులు నేరగాళ్ల ప్రధాన టార్గెట్‌గా మారుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం గోల్డ్ షాపులపైనే ఎక్కువగా నేరగాళ్లు కన్నేస్తున్నారు. కాబట్టి యాజమాన్యాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు," అని ఆయన హెచ్చరించారు. మీ షాపుల్లో ఉన్న సీసీ కెమెరాలు కేవలం ఉండటం సరిపోదు.. అవి సక్రమంగా పనిచేస్తున్నాయా, రికార్డింగ్ జరుగుతుందా అనేది నిరంతరం చెక్ చేయాలి" అని సూచించారు. అలారం సిస్టమ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి సమయంలో షాపులను బలంగా లాక్ చేయాలి. వీలైతే సెక్యూరిటీ గార్డులను కూడా పెట్టుకోవాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీ అప్రమత్తతే నేరాలను అడ్డుకుంటుందని డీఎస్పీ పేర్కొన్నారు. పోలీసులతో సమన్వయం పెంచుకుంటేనే చోరీలను ముందుగానే అరికట్టవచ్చని, జాగ్రత్తే రక్షణ అనే భావనతో ప్రతి యజమాని వ్యవహరించాలని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి గట్టి సందేశం ఇచ్చారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ శివశంకర్, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, పట్టణ ఎస్సైలు సుధీర్ కుమార్, చిన్న మల్సూర్, రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ పరమేష్, అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్, బంగారం షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం

## ఆదిలాబాద్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో 'రైతు వారోత్సవాలు'



ఆదిలాబాద్, మే : 05 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) : జిల్లాలో వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చేందుకు ఉద్యాన పంటలే సరైన మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా స్థానిక హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు వారోత్సవాల'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చేందుకు ఉద్యాన పంటలే సరైన మార్గమని, రైతులు కేవలం పత్తి, సోయా చిక్కుడు వంటి సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల వైపు దృష్టి సారించాలి. ఆదిలాబాద్ జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు ఎంతో అనుకూలం అని, దీని ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే భారీ సబ్సిడీలను, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, అధునిక సాగు పద్ధతులు, యాంత్రీకరణను జోడించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించవచ్చన్నారు. హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తల సలహాలను రైతులు ఎప్పటికప్పుడు పాటించాలని, ఆయిల్ పామ్ లేదా ఇతర పండ్ల తోటలలో అంతర పంటలుగా కూరగాయలు, అల్లం, పసుపు వంటివి సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రైతుకు ఆర్థిక భరోసా పెరుగుతుందని, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హత కలిగిన రైతుకు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకూడదని, రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం నిరంతరం అందుబాటులో ఉంచాలని అని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల విత్తనాల కిట్స్, ఆయిల్ ఫామ్ అగ్రిమెంట్ పత్రాలను కలెక్టర్ అందజేసి, సుగంధ ద్రవ్యాల స్టాల్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య, వివిధ మండలాల రైతులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రూ.3 కోట్లతో ఉబ్బ చెరువు వద్ద డ్రైనేజీ ప్రత్యేక పైప్ లైన్..

సదాశివపేట: ఉబ్బ చెరువు వద్ద డ్రైనేజీ వాటర్ చెరువులో కలవకుండా రూ.3 కోట్లు వెచ్చించి ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేయనున్నట్లు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. సదాశివపేట పట్టణంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమృత్ 2ఓ లో భాగంలో సుమారు రూ. 3 కోట్లతో ఉబ్బ చెరువు వద్ద డ్రైనేజీ వాటర్ చెరువులో కలవకుండా పైప్ లైన్ వేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా సదాశివపేట మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నిర్మల ప్రారంభించారు. అలాగే ఫయాజ్‌నగర్‌లోని నూతన ట్రాన్స్ఫారం కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత నిధులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్న, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పట్లూరి నాగరాజు గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు వాజిద్, దుబాయ్ వాజిద్, సజ్జు బాయ్, నర్సింలు మున్సిపల్ కమిషనర్ శివాజీ, మున్సిపాల్ ఇంజనీర్ రాజేష్, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు మండల నాయకులు, కార్యకర్తలు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో బీజేపీ విజయోత్సవ సంబరాలు



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి) వెస్ట్ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం గాంధీ చౌక్ వద్ద కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ "ఇది కేవలం రాజకీయ విజయం కాదు, దేశభక్తుల భావోద్వేగాలకు ప్రతిధ్వని" అని పేర్కొన్నారు. బీజేపీకి ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా ఇలాంటి ఫలితాలే రావాలంటే ప్రతి నాయకుడు, కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని దేవేందర్, మాజీ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శులు శంకర్, శ్రీను, అశోక్, ఉపాధ్యక్షులు కాశినాథ్, శివ, సీనియర్ నాయకులు బలరాజ్, సత్యం, కోశాధికారి గజనాన్, దళిత మోర్చా నాయకులు పండరి తదితరులు పాల్గొన్నారు

# సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**సమస్యలు ఉంటే తెలపాలని లబ్ధిదారులకు సూచన**



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఆకస్మికంగా పరిశీలించారు. బిల్లుల చెల్లింపుల స్థితిగతులు, క్షేత్రస్థాయి సమస్యలపై తనిఖీ నడుపుతూ, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. చర్ల మండలం పరిధిలో గల సత్యనారాయణపురం గ్రామంలో పర్యటించిన కలెక్టర్, ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిని స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులకు అందాల్సిన బిల్లుల చెల్లింపుల వివరాలు, నిధుల విడుదల ప్రక్రియలు అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ అంకిత్, "ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి జాప్యం జరగకూడదు. నిధుల విడుదలలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లేదా బిల్లుల చెల్లింపుల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిరుపేదల సొంతింటి కలను త్వరితగతిలో సాకారం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటన ద్వారా క్షేత్రస్థాయి సమస్యలు గుర్తించి, పరిష్కారాలు కనుగొనేందుకు దృష్టి పెట్టారు.

# అస్తమాను నిర్లక్ష్యం చేయొద్దు



కరీంనగర్ (తెలంగాణ వాణి) : అస్తమాను నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురికావద్దని మెడికవర్ పల్మనాలజిస్టు డాక్టర్ రవీంద్రచారి అన్నారు. వరల్డ్ అస్తమా డే సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ... దగ్గు, ఆయాసం, అలర్జీ మాత్రమే ఆస్తమా లక్షణాలన్నారు. అస్తమా అంటువ్యాధి కాదని, దుమ్ము, చల్లగాలి ద్వారా మాత్రమే ఊపిరితిత్తులు రియాక్షన్ అవుతాయని వెల్లడించారు. అస్తమా వచ్చిన వారు జీవితాంతం మందులు వాడాల్సిన పనిలేదని, అస్తమాను త్వరగా గుర్తిస్తే నయం చేయడం సులువు అవుతుందని తెలిపారు. అస్తమాకు ఇన్‌హేలర్తో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా మంచి ఫలితాలు ఉంటాయని, ఇన్‌హేలర్‌పై ఉండే అపోహలు నమ్మవద్దని చెప్పారు. అస్తమాను తగ్గించుకునేందుకు ట్యాబ్లెట్ల కంటే ఇన్‌హేలర్‌ను వాడడం మంచిదన్నారు. అస్తమా మందులు జీవితాంతం వాడాల్సిన పనిలేదని, ఆ వ్యాధిపై భయం వీడాల్సిన అవసరం ఉందన్నారు. దుమ్ము చల్లగాలికి దూరంగా ఉండడం... పడని వస్తువులు తినకుండా ఉండడంతో ఆస్తమాను దరిచేరకుండా చేయవచ్చని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్తో ఆస్తమాను పూర్తిగా దూరం చేయవచ్చని అన్నారు. అస్తమా దరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమస్య వచ్చాక ఇబ్బంది పడేకంటే రాకుండా కాపాడుకోవడం ఉత్తమమని వెల్లడించారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్...సోపాలు




ఒకప్పుడు ఆమ్‌ఆద్మీ పార్టీ పేరు వింటే చాలు, సగటు మనిషి ఛాతీ గర్వంతో మరో రెండు అంగుళాలు విశాలమయ్యేది. అవినీతిని అంతమొందించడంలో, ప్రజారంజకమైన పాలన అందించడంలో ఆ పార్టీ ముందుంటుందన్న ధైర్యం వారిలో అడుగడుగునా కనబడేది. కానీ, పద్నాలుగేళ్లు తిరిగేసరికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవినీతి కూపంలో నిండా మునిగిపోయి, ఊపిరాడక సతమతమవుతున్న ఆ పార్టీ సగటు మనిషికి ఏనాడో దూరమైంది. ఈ పరిస్థితికి కొంతవరకూ ఆ పార్టీ అధినేత కారణం కాగా, మరికొంత కేంద్రంలో చక్రం తిప్పుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కారణం. ఈ మిత్రద్వయం తరచూ వేస్తున్న ఎత్తుగడలకు చిత్తవడం కేజ్రీ వంతవుతోంది. మద్యం కుంభకోణం కేసులు బనాయించి, ముఖ్యమంత్రినే అరెస్ట్ చేయించి, ఆ కేసుల ఆధారంగా పార్టీ పెద్దలపై అవినీతి ముద్ర వేసి, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ కమలనాథులు అంతటితో ఆగలేదు. రాజ్యసభ సభ్యులైన ఏడుగురు ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలను తమవైపు తిప్పుకుని, బిజెపిలో విలీనం చేసుకోవడం తాజా పరిణామం. ఢిల్లీ మద్యం కేసులో సిబిఐ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో రాబోయే పంజాబ్ ఎన్నికల్లో గెలుపు తమదేనని సంతోషిస్తున్న కేజ్రీవాల్‌కు ఆ సంబరం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. నిన్నటివరకూ తనకు, పార్టీకి కుడిభుజంలా నిలబడినవారు సైతం అకస్మాత్తుగా ఇలా 'ఫిరాయించడం'తో కేజ్రీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆమ్‌ఆద్మీ పార్టీ పెట్టకముందునుంచీ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా మెలగిన రాఘవ్ చద్దా, స్వాతి మలీవాల్ వంటివారు సైతం బిజెపి గూటికి చేరిపోవడం వింతల్లోకెల్లా వింత. రాజ్యసభలో తమ బలాన్ని పెంచుకోవడం, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో పాగా వేయడం లక్ష్యంగా మోడీ, షా ద్వయం తాజా వ్యూహానికి తెర తీశారన్నది విస్పష్టం. ఆప్ ఎంపిల చేరికతో రాజ్యసభలో బిజెపి సభ్యుల బలం 113కి చేరగా, ఎన్‌డిఎ బలం 146కు పెరిగింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) లో లొసుగులను ఆసరా చేసుకుని ఇలా ఇతర పార్టీల సభ్యులకు ఎర వేసినందుకు మోడీ, అమిత్ షాలను తప్పుబట్టడంలో తప్పేమీ లేదు. అయితే, ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉంటూ, పదేళ్లపాటు ఢిల్లీని పాలించి చాలినంత రాజకీయ, పాలనా అనుభవం గడించి కూడా.. ప్రత్యర్థుల ఎత్తుగడలను చివరిదాకా పసిగట్టలేకపోయినందుకు కేజ్రీవాల్‌నూ అంతే తప్పుపట్టాలి. ప్రాంతీయ పార్టీల పొడ అసలే గిట్టని భారతీయ జనతా పార్టీ పెద్దలు, వాటి ఊపిరి తీసేందుకు ఎంతకైనా తెగిస్తారనేది గత చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది. దేశ రాజధానిలో తిష్ఠవేసుకుని కూర్చుని, తమకు పక్కలో బల్లెంలా మారిన ఆప్‌ను అంతమొందించాలన్నది మోడీ, అమిత్ షాల చిరకాల వాంఛ. అందులో చాలావరకూ కృతకృత్యులయ్యారన్నది ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతోనే రుజువైంది. ఇక పంజాబ్‌లోనూ ఆప్‌ను అధికారంనుంచి దింపడమే లక్ష్యంగా కేజ్రీవాల్ ఆరోపించినట్లు 'ఆపరేషన్ లోటస్'కు తెరతీశారు. మునుపటి ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్ విజ యం వెనుక కీలకపాత్ర పోషించిన రాఘవ్ చద్దాకు గాలం వేయడం అందులో భాగమే. అగ్నికి ఆజ్యం తోడైనట్లు, బిజెపి నేతల ఎత్తుగడలకు కేజ్రీవాల్ స్వయంకృతాపరాధాలు తోడయ్యాయి. అవినీతిని అంతం చేస్తానని నమ్మబలికిన ఆప్ అదే అవినీతికి ఆలవాలమైందన్న బిజెపి పెద్దల ఆరోపణలకు కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని తలదన్నుతూ కట్టుకున్న ఇల్లు, మద్యం కుంభకోణం వంటివి బలం చేకూర్చాయి. ఇప్పటికైనా మించింది లేదు. తమ పార్టీ నేతలు మరికొందరు చేజారకముందే ఆప్ అధినేత జాగ్రత్తపడటం మంచిది. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టేలా పదునైన వ్యూహాలను రచించగలగాలి. కొన్నేళ్లుగా పంజాబ్ లో పలువురు ఆప్ నాయకులను బిజెపి నయానో భయానో తమవైపు తిప్పుకోగలిగింది. ఈ తెలివిడి, రాజకీయ చతురత లేకనే ఆప్ అగ్రనేతలు ప్రత్యర్థులు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం భారత రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా బీజేపీలో చేరిక. ఆప్ కీలక నేతగా పేరున్న రాఘవ్, అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ నిర్ణయం వెనుక కారణాలపై పలు ఊహాగానాలు చెలరేగుతుండగా, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాఘవ్ చద్దా బీజేపీలో చేరడానికి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. "రాఘవ్ చద్దా తన సోదరి పరిణీతి చోప్రా భర్త కావడంతో ఆయనను కాపాడుకోవడానికి ప్రియాంక ఈ నిర్ణయం తీసుకున్నారు" అని కౌర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రాఘవ్ వెనుక పడ్డారని, త్వరలోనే ఆయనపై ఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రియాంకకు ముందే సమాచారం అందిందని ఆమె వెల్లడించారు. అందుకే తన చెల్లెలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాఘవ్‌ను బీజేపీ వైపు మళ్లించారని కౌర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, రాఘవ్ చద్దాకు ఆప్ అధిష్టానానికి మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని నవజ్యోత్ కౌర్ సిద్ధూ వివరించారు. పార్టీ కోసం రాఘవ్ సరిగా మాట్లాడటం లేదని ఆప్ నాయకత్వం భావించిందని, ఆ కారణంగానే వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆమె తెలిపారు. ఏదైనా తప్పు జరిగినప్పుడు అప్పుడే గళం విప్పాలని, నాలుగేళ్ల తర్వాత మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజకీయ మార్పు రాఘవ్ చద్దా సోషల్ మీడియా ఇమేజ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బీజేపీలో చేరిన మరుసటి రోజే ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలకు పైగా (రెండు మిలియన్లు) ఫాలోవర్లను కోల్పోయారు. ఆప్ తన వ్యవస్థాపక సూత్రాలు, సిద్ధాంతాల నుంచి దూరంగా వెళ్లడంతో తాము బీజేపీలో విలీనమయ్యామని మీడియా సమావేశంలో చద్దా వెల్లడించారు. ఆప్ కోసం 15 ఏళ్లు నా రక్తం, చెమట ధారపోశాను.. సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పార్టీ పూర్తిగా పక్కకు తప్పుకుంది" అని ఆయన అన్నారు. "రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చు" అని తమ పార్టీలోని 10 మంది ఎంపీల బలాన్ని ప్రస్తావిస్తూ చద్దా తెలిపారు. "వారు ఇప్పటికే సంతకాలు చేశారు.. ఈ ఉదయం మేము సంతకాలు చేసిన లేఖలు, ఇతర పత్రాలతో సహా అవసరమైన అన్నింటిని రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించడం... విలీనానికి అనుమతించడం చకచకా జరిగిపోయాయి. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పుట్టిన ఆప్.. 14 ఏళ్ల తర్వాత పార్టీ చరిత్రలోనే అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. సినీ ప్రముఖులు కునికా సదానంద్, ప్రకాష్ రాజ్ వంటి వారు కూడా రాఘవ్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన ఈ కీలక వ్యాఖ్యలపై ఇప్పటివరకు ప్రియాంక చోప్రా, పరిణీతి చోప్రా లేదా రాఘవ్ చద్దా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే, ఈ నిర్ణయం వెనుక నిజంగా ఇదే కథ ఉందా అనే ప్రశ్న ప్రజల్లో మొదలైంది. రాఘవ్ చద్దా రాకతో బీజేపీ బలం పెరుగుతుందా లేదా ఆమ్ ఆద్మీ పార్టీ దెబ్బతింటుందా అనేది వేచి చూడాలి. ఒకవైపు పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూ, మరోవైపు ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేసేలా రాజకీయ వ్యూహరచన చేయగలిగితేనే పంజాబ్‌లో ఆప్ అధికారాన్ని నిలుపుకునేది. మద్యం కుంభకోణ కేసులో సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును, తాజాగా తమ పార్టీ ఎంపిల విలీనం ఉదంతాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకువెళ్లగలగాలి. లేదంటే జాతీయ పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆమ్‌ఆద్మీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా పోయే పరిస్థితి దాపురిస్తుంది.

# పారదర్శకతతో సంక్షేమ పథకాల అమలు

**అభివృద్ధి..సంక్షేమమే మా తొలి ప్రాధాన్యత**
**పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**
**226 మంది లబ్ధిదారులకు రెండు కోట్ల 26 లక్షల రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మిలిషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**



పటాన్ చెరు , మే 5, (తెలంగాణ వాణి రిపోర్టర్): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్ చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్ చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటు పడుతున్నట్లు తెలిపారు. నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు పుష్ప నగేష్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, ఇతర మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అయిల్ ఫామ్‌తో అధిక లాభాలు

**పంట మార్పిడి,నూతన వంగడాలపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



నిర్మల్ – భైంసా: మే 05 (తెలంగాణ వాణి ప్రతినిధి): రైతులు అయిల్ ఫామ్ పంట సాగు ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు. భైంసాలోని శ్రీ బంకెట్ హాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఈ పంటను సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సుమారు 4200 ఎకరాల్లో అయిల్ ఫామ్ సాగు జరుగుతుందని తెలిపారు. అయిల్ ఫామ్ నాటిన తరువాత తొలి మూడు సంవత్సరాల పాటు అంతర పంటలు సాగు చేసే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో 20 వేల ఎకరాల వరకు విస్తరించినట్లయితే ఈ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పరిశ్రమ స్థాపనకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పంట మార్పిడి పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు లాభాల బాట పడతారని, ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అధిక వినియోగం ప్రజల ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులను సన్మానించారు. ఉద్యానవన శాఖ అధికారులు అయిల్ ఫామ్ సాగుపై ప్రెజెంటేషన్ ఇచ్చి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి,వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బాలు నాయక్,ఏడీఏలు వీణ,శ్రీనివాస్ రాజు,ఉద్యానవన శాఖ అధికారి జావీద్ పాషా, వ్యవసాయ శాఖ అధికారులు, సర్పంచ్‌లు,రైతులు పాల్గొన్నారు.

# అక్రమ పశువుల రవాణా గ్యాంగ్ అరెస్ట్

**"రూ.20 లక్షల విలువైన 89 గోవులు స్వాధీనం**

హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి): అక్రమంగా పశువులను రవాణా చేస్తూ భారీగా డబ్బులు సంపాదిస్తున్న గ్యాంగ్‌ను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటనలో రూ. 20లక్షల విలువ గల 89 గోవులను స్వాధీనం చేసుకొని, వాటిని సంరక్షణ కోసం ధర్మసాగర్ గోశాలకు తరలించారు. కేసుతో సంబంధం ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, ఒకరు పరారీలో ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు గత కొంతకాలంగా పశువులను అక్రమంగా రవాణా చేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకునిభారీగా పశువులను




చింతూరు ప్రాంతం నుండి కొనుగోలు చేసి జహీరాబాద్ మార్కెట్‌లో అమ్మేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో మే 2న చింతూరు పశువుల సంతలో సుమారు రూ. 11 లక్షల విలువైన 2 ఆవులు, 87 ఎద్దులను కొనుగోలు చేసి, కంటైనర్‌లో ఎక్కించారు. పోలీసులకు చిక్కకుండా బయలుదేరారు. అనుమానంతో కొందరు వ్యక్తులు కంటైనర్ ను వెంబడించారు. వారిని తప్పించుకునే క్రమంలో నిందితులు వారిని గాయపరిచి వారి యొక్క వాహనాన్ని దోపిడి చేసి పశువులతో పాటు అక్కడి నుండి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు బానవత్ నాగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, వేగవంతంగా దర్యాప్తు చేపట్టారు. కేవలం కొన్ని గంటల్లోనే గిర్నిబావి ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 89 గోవులు, ఇన్నోవా కారు, బ్రెజ్జా కారు, పశువుల రవాణా కోసం ఉపయోగించిన కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితులు హైదరాబాద్, సంగారెడ్డి ప్రాంతాలకు చెందినవారని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ కేసును వేగంగా ఛేదించిన హనుమకొండ ఎసిపి నరసింహరావు,కె యు సిఐ రవికుమార్, యస్ ఐ లు, సిబ్బందిని సెంట్రల్ జోన్ డి సి పి దార కవిత ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజలకు త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, మే:05(తెలంగాణ వాణి ప్రతినిధి): ప్రజలకు త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్, భవేశ్ మిశ్రా త్రాగునీటి అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎవరికి ఎట్టి పరిస్థితుల్లో త్రాగునీటి కొరత రాకూడదని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు అంతా గతంలో నీటి సమస్య ఏర్పడిన ప్రాంతాలను గుర్తించి, నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోజువారి నీటి సరఫరా లో ఆటంకాలు ఎదురైతే, సమస్యలు తీర్చేందుకు తగు ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే కడెం ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం పూర్తయ్యేలోపు గేట్లకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటినుంచి గేట్ల మరమ్మత్తుల చర్యలు పూర్తిచేస్తే వర్షాకాలం ఎటువంటి ఇబ్బంది కలగదని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఇరిగేషన్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్యూరియాసిటీ పెంచేస్తున్న 'ది రెడ్ బ్యాగ్' టీం







విలన్‌గా తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నాడు హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్. ఇప్పటిదాకా సిల్వర్ స్క్రీన్‌పై విలన్‌గా భయపెట్టిన కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ప్రసాద్ బెహరా మరో కీలక పాత్రలో నటించిన ఈ మూవీలో రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే ఈ మూవీ ప్రీ లుక్‌ను విడుదల చేశారు. నలుగురు అమ్మాయిల లుక్స్‌తో రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతుందంటూ హింట్ ఇచ్చారు మేకర్స్. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ చేసిన మరో పోస్టర్‌లో చేతినిండా రక్తం, ఆ బ్యాగును పట్టుకున్న తీరు, అక్కడే ఉన్న కత్తులు, తుపాకులు, రక్తపుమయంగా మారిన ఏరియా ఇలా ప్రతీ ఒక్కటి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఇటీవల సినిమాలో వచ్చే కీలక సన్నివేశాలను థాయ్‌లాండ్‌లో షూట్ చేసింది టీం. థాయ్‌లాండ్‌లో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నాయట. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం టీజర్‌ను త్వరలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్ బ్యాగులో ఏముంది.. కబీర్ దుహన్ సింగ్ పాత్ర ఎలా ఉండబోతుందనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశారు మేకర్స్. ఈ మూవీకి రవికుమార్ సీరపు కథ, కథనం అందించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నాడు. ది రెడ్ బ్యాగ్‌లో ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మే 15న థియేటర్లలోకి 'రాక్షసపురం' మూవీ






ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షస పుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ చిత్రాన్ని మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాత కేఎస్ రామారావు అధికారికంగా ప్రకటించారు. విభిన్నమైన నటనతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజ్ బి శెట్టి ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఇన్ స్పెక్టర్ పాత్రలో నటించారు. డాక్టర్ రవి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఒక ఉత్కంఠభరితమైన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇన్వెస్టిగేషన్ డ్రామా నేపథ్యంలో సాగే కథనం ప్రేక్షకులను అడుగడుగునా థ్రిల్‌కు గురి చేస్తుంది. విడుదల తేదీ మార్పుపై నిర్మాత కేఎస్ రామారావు స్పందిస్తూ.."ఈ సినిమాలోని మేకింగ్ విలువలు, సస్పెన్స్ ఎలిమెంట్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అందుకే ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నాం. సినిమాను మే 7న విడుదల చేయాలని ముందుగా అనుకున్నప్పటికీ, మరిన్ని మెరుగైన థియేటర్లు, గరిష్ట స్థాయిలో ప్రేక్షకులకు చేరువయ్యేలా చేసేందుకు వీలుగా మే 15న విడుదల చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా ఈ తేదీ సినిమాకు కలిసి వస్తుందని భావిస్తున్నాం. ఐపీఎల్ అనేది సినిమా ఇండస్ట్రీకి శాపంగా మారింది. భవిష్యత్‌లో ఐపీఎల్ సీజన్‌లో సినిమాలు విడుదల చేసే అవకాశం ఉండదు. ఐపీఎల్ లేని సమయంలోనే సినిమాలు విడుదల చేసేలా నిర్మాతలుప్లాన్ చేసుకోవాలి. ఒకవైపు ఓటీటీ, మరో వైపు ఐపీఎల్ వల్లసినిమా ఇండస్ట్రీకి భారీ నష్టంజరుగుతోంది." అని ఆయన తెలిపారు.ప్రస్తుతం ఐపీఎల్ సందడి మరియు ఓటీటీల పోటీ ఉన్నప్పటికీ, కంటెంట్ బలంగా ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, 'రాక్షసపురం' కచ్చితంగా ఆ కోవలోకి వస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది. షోల వివరాలు: మే 15న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నామని, మార్నింగ్ మరియు మ్యాట్నీ షోలకు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్లు పేర్కొన్నారు. ట్రైలర్ అప్‌డేట్: త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్, ఇతర ప్రోమోలను విడుదల చేసి ప్రమోషన్స్ వేగవంతం చేయనున్నారు.

# కృష్ణగారిలాంటి హీరోను నేను చూడలేదు



వెండితెరపై ఆవేశపూరితమైన పాత్రలను చేయడంలో శివకృష్ణకి ఒక ప్రత్యేకత ఉంది. ఉద్యమాలు .. తిరుగుబాట్లకి సంబంధించిన కథలలో ఆయన ఎక్కువగా కనిపిస్తూ వచ్చారు. అలాగే విలేజ్ నేపథ్యంలోని సినిమాలలోనూ ఎక్కువగా నటించారు. హీరో కృష్ణతో కలిసి ఆయన అనేక సినిమాలో నటించారు. తాజాగా 'ఐ డ్రీమ్ టీవీ'వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కృష్ణను గురించి ప్రస్తావించారు. "కృష్ణగారు మహానుభావుడు .. ఒక నటుడిగా నేను అంటే ఆయనకి ఎంతో అభిమానం. ఫలానా పాత్ర కోసం శివకృష్ణను తీసుకుందామని ఆయన దగ్గర అంటే, వెంటనే ఒప్పేసుకునేవారు. నాకు కాస్త శ్రమ తగ్గుతుందయ్యా .. మనవాడే .. తీసుకోండి అనేవారు. నేను ఎన్టీఆర్ అభిమానినని ఆయనకి కూడా తెలిసే ఉంటుంది. కానీ ఆ విషయాలను ఆయన ఎప్పుడూ ప్రస్తావించేవారు కాదు. ఎన్టీఆర్ తరువాత భోళా మనిషి ఎవరంటే నేను కృష్ణగారి పేరే చెబుతాను" అని అన్నారు. "కృష్ణగారు తన సినిమాలు మధ్యలో ఆగిపోయే పరిస్థితి వచ్చినప్పుడు తాను డబ్బులు పెట్టేవారు. మిగతా డబ్బులు ఇవ్వలేమని నిర్మాతలు చెబితే, చాలా తేలికగా 'ఓకే' అని అనేవారు. ఏ నిర్మాతను ఎప్పుడూ ఇబ్బంది పెట్టిన దాఖలాలు ఎవరికీ కనిపించవు. తాను హామీగా ఉండి సినిమాలను రిలీజ్ చేయించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎవరేమనుకున్నా ఫరవాలేదు గానీ, ఆయనలాంటి హీరో మరొకరు లేరు .. ఇది నిజం" అని చెప్పారు.




# బాడీ షేమింగ్‌తో నరకం చూశా..





ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు.రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి. 15 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగినా కూడా పడని పరిస్థితి. ఆ నొప్పి తట్టుకోలేక ఒక దశలో 'నన్ను చంపేయండి' అని అమ్మను అడిగాను అంటూ తన అనుభవాన్ని వివరించారు. ఈ ఘటన తనను మానసికంగా కూడా తీవ్రంగా ప్రభావితం చేసిందని చెప్పారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న సుప్రిత తన కెరీర్‌పై స్పష్టతతో ముందుకు సాగుతున్నారు. కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా నటించడానికి సిద్ధమని తెలిపారు. ఇక అగ్ర హీరోల సినిమాల్లో కూడా తాను నటించాలనే ఆసక్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ సినిమాల్లో చెల్లెలి పాత్రలు వచ్చినా చేయడానికి రెడీ అని చెప్పారు. అయితే తనకు ఇష్టమైన విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేని సరసన అలాంటి పాత్రలు చేయడం కష్టమని సరదాగా వ్యాఖ్యానించారు. సుప్రిత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తల్లి ప్రోత్సాహంతో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె, ఇప్పటికే కొన్ని సినిమాల ద్వారా ప్రేక్షకులను అలరించారు. బిగ్ బాస్ ఫేమ్ అమర్ దీప్ చౌదరి సరసన నటిస్తున్న 'చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. 2019లో 'మనీ మైండెడ్ గర్ల్ ఫ్రెండ్' షార్ట్ ఫిల్మ్‌తో ప్రారంభమైన సుప్రిత ప్రయాణం, ఇప్పుడు వెండితెరపై మరింత బలంగా కొనసాగుతోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారు.

# మళ్లీ సందడికి సిద్ధమైన సుకమార్-రామ్ చరణ్ కాంబో..



రామ్ చరణ్-సుకుమార్ కాంబోలో వచ్చిన రంగస్థలం టాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ మూవీ తర్వాత అదే జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు సుకుమార్, స్టార్ హీరో రామ్ చరణ్ కలిసి ఆర్‌సీ17(వర్కింగ్ టైటిల్) పేరుతో కొత్త సినిమాను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూలై నెల నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. సుకుమార్ కథా పనులను పూర్తిచేసి, ప్రస్తుతం చివరి మెరుగులు దిద్దుతున్నారని తెలుస్తోంది. రంగస్థలం తరహాలోనే గ్రామీణ నేపథ్యంలో, భావోద్వేగాలు మరియు మాస్ అంశాలతో ఈ సినిమా రూపొందనున్నట్లు సమాచారం. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందించనున్నారు. గతంలో వచ్చిన రంగస్థలం చిత్రం వసూళ్ల పరంగా మాత్రమే కాకుండా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అందుకే ఇప్పుడు ఈ కొత్త సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. మరోవైపు, రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్రీడా నేపథ్యంలో సాగే యాక్షన్ కథాచిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' పాత్రలో కనిపించనుండగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఏ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇలా వరుస సినిమాలతో రామ్ చరణ్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే రామ్ చరణ్ నుండి మరి కొద్ది రోజులలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న పెద్ది చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. 1980ల నాటి ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం జూన్ 4న విడుదలకి సిద్ధమైంది. ఈ సినిమాలో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' పాత్రలో కనిపిస్తుండగా, జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ'గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి భారీ తారాగణం ఉన్న ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ఇందులోని 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో ఎంత ట్రెండ్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

# భానుచందర్ లేటెస్ట్ లుక్ వైరల్..



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 80, 90వ దశకాల్లో యాక్షన్ హీరోగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన భానుచందర్ తాజాగా మరోసారి వార్తల్లో నిలిచారు. ఒకప్పుడు చాక్లెట్ బాయ్‌గా, తర్వాత పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆయన, ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతున్నారు. అయితే ఇప్పుడు ఆయన లేటెస్ట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది. కోనసీమలోని అమలాపురానికి చెందిన ప్రముఖ వంట మాస్టర్, "గోదావరి రుచులు" అధినేత చిట్టిబాబుకు భానుచందర్ వీరాభిమాని. చిట్టిబాబు వంటకాల రుచికి ఫిదా అయిన సెలబ్రిటీలలో భానుచందర్ కూడా ఒకరు. ఈ సందర్భంగా చిట్టిబాబు పెళ్లిరోజు వేడుకల సందర్భంగా భానుచందర్ ప్రత్యేక వీడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఆ వీడియోలో ఆయన కనిపించిన తీరు ఇప్పుడు చర్చకు దారితీసింది. ఈ వీడియోలో భానుచందర్ పూర్తిగా తెల్లబడిన జుట్టు, గడ్డంతో 'సాల్ట్ అండ్ పెప్పర్' లుక్‌లో కనిపించారు. ఒకప్పుడు తెరపై కనిపించిన గ్లామరస్ లుక్‌తో పోలిస్తే ప్రస్తుతం ఆయనలో భారీ మార్పు కనిపించడంతో, కొందరు నెటిజన్లు "ఇతను భానుచందరా?" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయస్సు 73 ఏళ్లు కావడంతో సహజంగానే వచ్చిన ఈ మార్పు అభిమానులను షాక్‌కు గురిచేసింది. మేకప్ లేకుండా చాలా సాధారణంగా కనిపించడంతో ఈ వీడియో మరింత వైరల్ అయింది. అయితే రూపం మారినా ఆయనలోని గంభీరమైన స్వరం, కళ్లలోని పవర్ మాత్రం అలాగే ఉందని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# గేమ్ ఛేంజర్ కానున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్




వరంగల్, : తెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రంలో వరంగల్ జిల్లా మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,327 ఎకరాల్లో విస్తరించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం మిత్ర' పథకం కింద బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఈ పార్క్‌ను, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించను న్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక గేమ్ ఛేంజర్.కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '5ఎఫ్' విజన్ (ఫార్మ్, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) కాన్సెప్ట్‌తో ఈ పార్క్‌రూపుదిద్దుకుంది. అంటేపత్తి సాగు చేసే రైతు నుంచి, విదేశీ వీధుల్లో ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన వరకుఒకే గొడుగుకింద కార్యకలాపాలు సాగుతాయి. ఇందుకోసం కేంద్రం మొదటి దశలో 200 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గడిచిన రెండేళ్లలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి.మొత్తం 1,695 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చెందిన ఈ పార్క్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 232/132/33 కేవీ పవర్ సబ్ స్టేషన్లు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 'సీఈటీపీ జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్ ట్రయల్ రన్‌లో ఉంది.ఒకప్పుడు పనుల జాప్యంతో నిరాశ చెందిన స్థానిక యువతకు, రైతులకు ఈ పార్క్ ఇప్పుడు ఆశాదీపంలా మారింది.ఈ ప్రాజెక్ట్ ద్వారాసుమారు 24,400 మందికి నేరుగా ఉపాధి లభించనుంది. ఇప్పటికే 2 వేల మంది విధుల్లో ఉండగా, రానున్న రోజుల్లో శిక్షణ పొందిన వేలాది మందికి అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే గణేశా ఎకో, యంగ్ వన్ వంటి కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ 'కైటెక్స్' కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు 3842 కోట్ల పెట్టుబడులు రాగా, భవిష్యత్తులో ఇది 6వేల కోట్లకు చేరుతుందని అంచనా. 2017లో శంకుస్థాపన జరిగినప్పటి నుంచి ఎన్నో ఆటంకాలను దాటుకుని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఓరుగల్లు గడ్డపై అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ హబ్ సాకారమైంది. పార్క్‌లోని 62 శాతం భూములు ఇప్పటికే ఇండస్ట్రీలకు కేటాయించడమే దీనికున్న డిమాండ్‌కు నిదర్శనం. పత్తి పండించే రైతుకు గిట్టుబాటు ధర, స్థానిక యువతకు ఉద్యోగం, విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చే ఎగుమతులు.. ఇలా అన్ని కోణాల్లోనూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ ప్రగతి చక్రంలో కీలక మైలురాయిగా నిలవబోతోంది తెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రంలో వరంగల్ జిల్లా మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,327 ఎకరాల్లో విస్తరించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం మిత్ర' పథకం కింద బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఈ పార్క్‌ను, ఈ నెల 10నప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక గేమ్ ఛేంజర్.కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '5ఎఫ్' విజన్ (ఫార్మ్, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) కాన్సెప్ట్‌తో ఈ పార్క్ రూపు దిద్దుకుంది.అంటే పత్తి సాగుచేసే రైతు నుంచి, విదేశీ వీధుల్లో ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన వరకు ఒకే గొడుగు కింద కార్యకలాపాలు సాగుతాయి. ఇందుకోసం కేంద్రం మొదటి దశలో 200 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గడిచిన రెండేళ్లలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి.మొత్తం 1,695 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చెందిన ఈ పార్క్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 232/132/33 కేవీ పవర్ సబ్ స్టేషన్లు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 'సీఈటీపీ జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్ ట్రయల్ రన్‌లో ఉంది.ఒకప్పుడు పనుల జాప్యంతో నిరాశ చెందిన స్థానిక యువతకు, రైతులకు ఈ పార్క్ ఇప్పుడు ఆశాదీపంలా మారింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 24,400 మందికి నేరుగా ఉపాధి లభించనుంది. ఇప్పటికే 2 వేల మంది విధుల్లో ఉండగా, రానున్న రోజుల్లో శిక్షణ పొందిన వేలాది మందికి అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే గణేశా ఎకో, యంగ్ వన్ వంటి కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ 'కైటెక్స్' కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు 3842 కోట్ల పెట్టుబడులు రాగా, భవిష్యత్తులో ఇది 6వేల కోట్లకు చేరుతుందని అంచనా. 2017 లో శంకుస్థాపనజరిగినప్పటి నుంచి ఎన్నో ఆటంకాలను దాటుకుని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఓరుగల్లు గడ్డపై అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ హబ్ సాకారమైంది. పార్క్‌లోని 62 శాతం భూములు ఇప్పటికే ఇండస్ట్రీలకు కేటాయించడమే దీనికున్న డిమాండ్‌కు నిదర్శనం. పత్తి పండించే రైతుకు గిట్టుబాటు ధర, స్థానిక యువతకు ఉద్యోగం, విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చే ఎగుమ తులు.. ఇలా అన్ని కోణాల్లోనూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ ప్రగతి చక్రంలో కీలక మైలురాయిగా నిలవబోతోంది.

## పాల్వంచ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వాక్సిన్ రూమ్ ప్రారంభం



పాల్వంచ, మే 05 : నవ భారత్ కంపెనీ పాల్వంచ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీస్ కార్యక్రమంలో భాగంగా పాల్వంచలోని శేఖరంబంజర్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్ లో వ్యాక్సిన్ రూమ్ ను నిర్మించారు. దీనిని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ శేఖర బంజర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ.. వాక్సిన్ సమయంలో రోగులు ఎదురుకుంటున్న సమస్యలను నవ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి మూడు నెలల్లోనే వాక్సిన్ రూమ్ ను నిర్మాణం చేసి అప్పగించడం జరిగిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల కోసం వెయిటింగ్ రూమ్ నిర్మించడం, కొవిడ్ సమయంలో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్ ను ఏర్పాటు చేయడం, ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి నవ లిమిటెడ్ చేస్తున్న కృషిని కొనియాడారు.

డి.జి.ఎమ్ సి.హెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ నవ లిమిటెడ్ చేస్తున్న ఆరోగ్యం, విద్య, జీవనోపాదుల కార్యక్రమలను వివరించారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఆర్ మేనేజర్, సి.హెచ్. శ్రీనివాసరావు, సివిల్ ఇంజినీర్ ఫణింద్రచారి, కరుణాకర్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, సి.ఎస్.ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, మే:05(తెలంగాణ వాణి ప్రతినిధి): సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సిఎంఆర్ డెలివరీ ప్రక్రియ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేయాలని అన్నారు. సిఎంఆర్ కు సంబంధించిన వివరాలను మిల్లర్ల వారిగా సమీక్షించారు. సిఎంఆర్ డెలివరీలో వెనుకబడిన మిల్లర్లు, ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. అన్ని మిల్లులలో, మిల్లులకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి అధికారులు, మిల్లర్లకు అవగాహన కల్పించాలని వివరించారు. సీఎంఆర్ ప్రక్రియలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యపు సంచులు ఉంచడానికి తగిన గోదాములు ఇతరత్రా ప్రదేశాలు అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా ధాన్యపు సంచులను తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధాన్యపు సంచులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో..

# బక్రీద్ పండుగను జరుపు కోవాలి

### ముస్లిం మత పెద్దలతో డిఎస్పీ కార్యాలయంలో సమావేశం

### అదనపు ఎస్పీ రాజేష్ మీనా



వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వనపర్తి జిల్లాలో బక్రీద్, పండుగను సోదర భావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ రాజేష్ మీనా అన్నారు. బక్రీద్, పండుగ సందర్భంగా మంగళవారం రోజు వనపర్తి డిఎస్పీ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్, పండుగ శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మత సామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతపెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో 3 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉంటేనే, పరిశీలించి అనుమతిస్తారని అన్నారు.ప్రధానంగా నిబంధనలు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే సామరస్య పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ముఖ్యంగా యువత ఆవేశంతో చేస్తున్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యగా తలెత్తె ప్రమాదం వుంటుంది కాబట్టి మతపెద్దలు యువతకు సమన్వయం పాటించేలా దిశానిర్దేశం చేయాలని అన్నారు.ప్రధానంగా జిల్లాలో ఏ చిన్న సంఘటన జరిగిన ఎడిటింగ్ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ఐక్యతను, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టడం తద్వారా శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తున్న వారిపై పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందని తెలిపారు. సమావేశంలో ఇతర పోలీస్ అధికారులు కూడా పాల్గొని తమ తమ సూచనలు వెల్లడించారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖ మరియు ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పోలీసుశాఖ చర్యలను అభినందిస్తూ, శాంతి భద్రతలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ముస్లిం మత పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి : ఆరూరి రమేశ్



న్యూశాయంపేట, మే 5 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హంటర్‌రోడ్ క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమీక్షా సమావేశం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ మాట్లాడుతూ రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలను కోరారు. భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీ దేనని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బుధవారం ఉదయం 9 గంటలకు హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్ సర్కిల్ వద్ద నిర్వహించబోయే రైతు సంగ్రామ సదస్సుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్న సందర్భంగా రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, హనుమకొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ : బాలాపూర్ పరిధిలోని కొత్తపేట గాలిబ్ కాలనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

### మంత్రి పొంగులేటికి టీఎస్ జెయు కృతజ్ఞతలు

హైదరాబాద్ : మే 05 (తెలంగాణ వాణి ప్రతినిది): అక్రిడిటేషన్ల జారీతో పాటు, జూన్ 2 నాటికి ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణలో జర్నలిస్టుల చిరకాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ మరియు ఐ అండ్ పిఆర్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్గ సహచరులందరికీ 'తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్'పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో గుర్తింపునకు నోచుకోక ఇబ్బందులు పడ్డ ప్రింట్, ఎలక్ట్రానిక్, కేబుల్ ఛానల్స్ జర్నలిస్టులకు, వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు జీవో 252 (జీఓ 252) ద్వారా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసే గొప్ప నిర్ణయం తీసుకున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం. గత ప్రభుత్వం కేవలం 23, 352 మందికే అక్రిడిటేషన్లను పరిమితం చేయగా, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏకంగా 46,000 మందికి పైగా అర్హులైన జర్నలిస్టులందరికీ ఈ అవకాశాన్ని విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మే 1న జిల్లాల్లో కలెక్టర్ల ద్వారా కార్డుల పంపిణీకి ఆదేశాలు జారీ చేయడం, దరఖాస్తులకు మే 10వ తేదీని తుదిగడువుగా నిర్ణయించడం, అర్హులైన జర్నలిస్టులందరికీ మెరుగైన ఆరోగ్య, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామని ప్రకటించడం జర్నలిస్టులకు కొండంత భరోసాను ఇచ్చింది. ఏప్రిల్ 30తో ముగుస్తున్న బస్ పాస్‌ల గడువును పొడిగించడం ఎంతో ఊరటనిచ్చింది. ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు జూన్ 2 నాటికి పరిష్కారం: దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులు చారిత్రాత్మకం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో వివిధ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ లతో సమావేశమై జూన్ 2వ తేదీ (తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం) నాటికి న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించడం పట్ల టీఎస్ జెయు హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రతిష్టాత్మక మైన 'ఫ్యూచర్ సిటీ'లో ఎమ్మెల్యేలు, అధికారులతో పాటు జర్నలిస్టులకు కూడా స్థలాలు ఇస్తామని ముఖ్య మంత్రి సానుకూలంగా ఉండటం ఆయన దార్శనికతకు నిదర్శనం. 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ సహా ఇతర సొసైటీల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు, జర్నలిస్టు సంఘాల్లో సభ్యులు కాని అర్హులైన వారికి కూడా న్యాయం చేసేందుకు మంత్రి పొంగులేటి తీసుకుంటున్న చొరవ అభినందనీయం. అందరూ ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ గా ఏర్పడాలన్న మంత్రి సూచన ను టీఎస్ జెయు స్వాగతిస్తోంది. ఈ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న ఐ అండ్ పి ఆర్ స్పెషల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులకు మా ధన్యవాదాలు. జర్నలిస్టుల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి గత (బీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో పత్రికా స్వేచ్ఛను హరించి, జర్నలిస్టులను దునుమాడిన ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా.. నా (పురుషో త్తం నారగౌని) అధ్యక్షతన ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించాము. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా ఆధర్నాకు హాజరై, మా పోరాటానికి,జర్నలిస్టులకు అండగా నిలబడ్డ వాస్తవాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాము. నాడు ప్రతిపక్ష నాయకుడిగా జర్నలిస్టుల కష్టాలను కళ్లారా చూసిన రేవంత్ రెడ్డి నేడు ముఖ్యమంత్రి హోదాలో జర్నలిస్టులకు ఈ ప్రయోజనాలను కల్పిస్తున్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి మరియు మంత్రివర్గ సభ్యుల కు టీఎస్ జెయు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది.



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com